జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | సోమవారం 14 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :242 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967


# ఫలితాలు కనిపించాలి!

'బ్రిక్స్ పగ్గాలు చైనాకు.. ఇకపై ఫలితాలు చూపించాల్సిందే'

బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ

ఢిల్లీ డిక్లరేషన్‌ను కాలపరిమితితో అమలు చేయాలని బ్రిక్స్ దేశాలకు మోదీ సూచన

బ్రిక్స్ ఇక కేవలం దేశాల కూటమి కాదని, పరిష్కారాల వ్యవస్థ అన్న ప్రధాని






### రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చెయ్యాలి

- వారి గళాన్ని వినిపిస్తున్నాం.. అందుకే బ్రిక్స్‌పై నమ్మకం
- బ్రిక్స్ కూటమిపై గ్లోబల్ సౌత్ దేశాలకు విశ్వాసం పెరిగిందన్న మోదీ

*గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ సంక్షోభాల విషయంలో ముందు వరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనుక వరుసలో ఉండిపోతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇకపై గ్లోబల్ సౌత్ నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. నియమాలు రూపొందించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలమని అన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.*

## మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు

- భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన వస్తే
- శత్రువుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రధాని మోదీ చేశారు
- 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో ముందుంటుందనే విశ్వాసాన్ని మోదీ ప్రజలకు కలిగించారన్న షా
- మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని స్పష్టం
- డీకాలనైజేషన్ అంటే సత్యాన్ని ప్రామాణికంగా చూడడమేనని వ్యాఖ్య





## ఏపీకి 'అల్పపీడనం' ముప్పు

- అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి
- అత్యధికంగా 79.1, అత్యల్పంగా 32.5 మి.మీ వర్షపాతం నమోదవుతుంది
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది

## పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు వినాయక చవితి శుభాకాంక్షలు




వినాయక చవితి సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున రేపు (మంగళవారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

## దక్షిణాఫ్రికాతో ఆర్థిక బంధంపై ఫోకస్

- కీలక దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు
- కజకిస్థాన్ అధ్యక్షుడు టోకయేవ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు
- ఫిలిప్పీన్స్, ఉగాండా, దక్షిణాఫ్రికా, బురుండి నేతలతో కూడా భేటీలు
- వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యం, గ్లోబల్ సౌత్‌పై ప్రధానంగా చర్చలు



## పిడుగుపాటుతో నలుగురు మృతి..

- సీఎం చంద్రబాబు తీవ్ర విచారం
- పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు మృతి
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ఉరుముల శబ్దానికి ఇద్దరు, పిడుగుపాటుకు మరో ఇద్దరు మృతి

## కేంద్ర పథకాల నిధులపై ప్రభుత్వం కసరత్తు

- రూ.25,304 కోట్లు మంజూరు
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా అమలయ్యేందుకు ఒక్కో రూపాయిని ఎలా సేకరించవచ్చో ప్రభుత్వం కసరత్తు
- కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులకు, రాష్ట్ర వాటాను జతచేసి పలు కార్యక్రమాలను అమలు
- కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రాబట్టడంతో పాటు అవి సకాలంలో ఖర్చుయ్యేలా సీఎం చంద్రబాబు ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లకు మార్గదర్శనం



**అమరావతి**

ఏపీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా అమలయ్యేందుకు ఒక్కో రూపాయిని ఎలా సేకరించవచ్చో సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులకు, రాష్ట్ర వాటాను జతచేసి పలు కార్యక్రమాలు అమలుచేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహి ళలు, శిశువులు, గర్భిణులకు ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలతో పాటు పల్లెల్లో ప్రగతి పనులకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ఠంగా నిధులు రాబడుతోంది. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో 86 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.25,304 కోట్లు మంజూరు చేయించు కోగలిగింది. ఈ మొత్తం 2024-2025లో - మిగతా3లో



## రాష్ట్రంలో లోక్ అదాలత్‌కు భారీ స్పందన

- ఒక్కరోజే 2.22 లక్షల కేసులు పరిష్కారం
- జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్
- శనివారం ఒక్క రోజే 2,22,770 పైగా కేసులు పరిష్కారమయ్యాయి
- రూ.212.49 కోట్లకు పైగా పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీ

**అమరావతి**

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు భారీ స్పందన లభించింది. శనివారం ఒక్క రోజే 2,22,770 పైగా కేసులు పరిష్కారమయ్యాయి. రూ.212.49 కోట్లకు పైగా పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీచేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి - మిగతా3లో

## చైనా విషయంలో కేంద్రం వ్యూహాత్మకంగా లొంగిపోతోంది

- జిన్‌పింగ్‌తో మోదీ భేటీపై 4 ప్రశ్నలు సంధించిన కాంగ్రెస్
- మోదీ-జిన్‌పింగ్ భేటీ తర్వాత కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు
- గల్వాన్, అరుణాచల్ ప్రదేశ్‌పై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన కాంగ్రెస్
- చైనాతో రికార్డు స్థాయిలో పెరిగిన వాణిజ్య లోటుపై తీవ్ర ఆందోళన



# ఫలితాలు కనిపించాలి!




బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా మారుతోందని పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఇకపై కాలపరిమితితో అమలు చేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. నిర్ణయాలు, ప్రకటనలు కేవలం ఫైళ్లలో ఉండిపోకూడదని, ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా వాటిని అమలు చేయాలని అన్నారు. చివరి స్థాయిలోనూ ఫలితాలు కనిపించేలా కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి కేవలం ఆలోచనలు, హామీలను మాత్రమే ఆశించడం లేదని అన్నారు. స్పష్టమైన ఫలితాలను కోరుకుంటోందని, బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, బలంగా మార్చుకోవచ్చని తెలిపారు. కీలక ఖనిజాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయని అన్నారు. ఇంధన భద్రతతో పాటు తక్కువ కాలుష్యంతో కూడిన సాంకేతికతల అభివృద్ధిలో వీటి పాత్ర కీలకమని చెప్పారు. వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూ సరఫరా వ్యవస్థలను నమ్మకంగా, వైవిధ్యంగా, స్థిరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**టెక్నాలజీ విషయంలో అందరికీ అవకాశం!**

టెక్నాలజీ, కీలక ఖనిజాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం బ్రిక్స్ దేశాల ఉమ్మడి అభివృద్ధికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని మోదీ హెచ్చరించారు. సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. ఇదే సమయంలో కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఆలోచనలు, పెద్ద స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలోనూ టెక్నాలజీని మరింత సమర్థంగా ఉపయోగించుకునేలా బ్రిక్స్ నెట్‌వర్క్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ తెలిపారు. కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులను రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడమే దీని లక్ష్యమన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో బ్రిక్స్‌పై నమ్మకం పెరుగుతోందని మోదీ చెప్పారు. ఆయా దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలను గౌరవించడం, వారికోసం మాత్రమే కాకుండా వారితో కలిసి పరిష్కారాలను రూపొందించడం వల్లే ఈ నమ్మకం పెరిగిందన్నారు.


**బ్రిక్స్ బలం వైవిధ్యంలోనే!**

వేర్వేరు దేశాలు, వేర్వేరు పరిస్థితులు ఉన్నప్పటికీ సహకారంతో ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని ప్రధాని అన్నారు. వైవిధ్యమే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సహకారం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, ప్రతినిధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, ఆలోచనలు బ్రిక్స్ సహకారానికి మరింత బలం చేకూర్చాయని అన్నారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న చైనాకు శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీ సదస్సును విజయవంతం చేసిన అన్ని దేశాల బృందాలను అభినందించారు. దిల్లీ డిక్లరేషన్‌తో బ్రిక్స్ మరింత విస్తృతంగా, బలమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని మోదీ స్పష్టం చేశారు.

# రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చెయ్యాలి

బ్రిక్స్ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్నామని, అందుకే ఆ దేశాలకు ఈ కూటమిపై విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ బలానికి మూలమని ఆయన ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. ఈ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలు, అనుభవాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నందునే వాటి నమ్మకాన్ని చూరగొన్నామని తెలిపారు. “నా వ్యక్తిగత అనుభవం నుంచి చెబుతున్నాను, బ్రిక్స్ పట్ల గ్లోబల్ సౌత్ దేశాల విశ్వాసం పెరిగింది. ఎందుకంటే వారి గొంతు ఇక్కడ వినిపిస్తుంది, వారి అనుభవాలను గౌరవిస్తాం. పరిష్కారాలను కేవలం వారి కోసం మాత్రమే కాకుండా, వారితో కలిసి రూపొందిస్తాం. మా భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ అసలైన బలం” అని ప్రధాని మోదీ వివరించారు. ఈ వేదికపై విభిన్న దేశాల మధ్య సహకారం ప్రపంచ పురోగతికి, మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. “భారతీయ నాగరికతలో ప్రకృతికి తల్లి స్థానం ఇచ్చాం. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలు అనే




బలమైన నమ్మకం మాది” అని మోదీ అన్నారు. భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను పాటించడంపై బ్రిక్స్ దృష్టి సారించిందని తెలిపారు. బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్‌లో చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు. “స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా, అందుబాటులోకి తెచ్చేందుకు స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వల కోసం ‘బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ను ఏర్పాటు చేశాం” అని వెల్లడించారు. అదేవిధంగా, వ్యవసాయం, వాతావరణ మార్పుల అనుసరణ, పర్యావరణ సుస్థిరత వంటి రంగాల్లో సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించడం ఎంతో ముఖ్యమని అన్నారు. “వ్యవసాయ పర్యావరణం, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్.. సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో కలుపుతాయి” అని పేర్కొన్నారు.

“మనమంతా విభిన్న వాస్తవికతలతో ముడిపడి ఉండవచ్చు, కానీ సహకారంతో కలిసికట్టుగా ఎదుగుతాం, మానవాళి కోసం వికసిస్తాం. మన భిన్నత్వమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా నిలవాలి. మన పురోగతి సమస్త మానవాళికి సేవ చేయాలి” అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

**జిన్‌పింగ్ సమక్షంలోనే.. అరుదైన ఖనిజాల అంశం..!**

సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలను చూపి బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు సమష్టి వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తాయని పరోక్షంగా చైనాను ఉద్దేశిస్తూ పేర్కొన్నారు. అరుదైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం చెలాయిస్తున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అక్కడే ఉండడం గమనార్హం. కాగా ప్రపంచంలోని అరుదైన ఖనిజాలలో సుమారు 90శాతం చైనానే ప్రాసెస్ చేస్తుంది. ఈ ఖనిజాలు సోలార్ ప్యానెళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్‌ల వరకు అన్నింటిలోనూ ఉపయోగిస్తారు. గతేడాది అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో.. ఈ అరుదైన ఖనిజాల ఎగుమతిపై నిబంధనలను చైనా కఠినతరం చేసింది. తర్వాత ఆ ఆంక్షలలో కొన్నింటిని సడలించింది.

# మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు

గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడి మరీ సమాధానం చెప్పే ప్రధాని భారత్‌కు ఉంటారని ఎవరూ ఊహించలేదని అమిత్ షా అన్నారు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ లేదా ‘ఆపరేషన్ సిందూర్’, ఇలా ఏది తీసుకున్నా, భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన చేయడానికి కూడా శత్రువులు వెన్నులో భయం పుట్టేలా చేసే రక్షణ విధానాన్ని నరేంద్ర మోదీ రూపొందించారని అన్నారు. రామ జన్మభూమి ఆలయ నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్, కేదార్‌నాథ్ పునరుద్ధరణ లేదా ‘మహాకాల్ లోక్’ నిర్మాణం వంటివి, ఏళ్ల తరబడి ఎవరూ మాట్లాడటానికి కూడా సాహసించని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని చెప్పారు. మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని, 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో అన్ని దేశాల కంటే ముందుంటుందనే బలమైన విశ్వాసాన్ని ప్రజలకు కలిగించారని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. 2014లో భారత్? ‘ఫ్రాజైల్ ఫైవ్’ (బలహీనమైన ఐదు దేశాలు) జాబితాలో ఉండగా, నేడు అగ్రశ్రేణి కలిగిన ఐదు దేశాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. నేడు ప్రపంచ దేశాలతో భారత్?కు ఉన్న రత్నాలు, ఆభరణాల వ్యాపార సంబంధాలకు దాదాపు 6,000 సంవత్సరాల నాటి సుదీర్ఘమైన చరిత్ర ఉందని షా పేర్కొన్నారు. ఆదివారం ముంబయిలో జరిగిన 52వ ఇండియా జెమ్ అండ్? జ్యువెలరీ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న షా ఈ మేరకు ప్రసంగించారు. “ల్యాబ్ గ్రోన్ డైమండ్ల(కృత్రిమ వజ్రాలు) వ్యవస్థపై భారతీయులకు పట్టు ఉండాలి. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలు మన వద్ద ఉన్నాయి. పరిమాణం పరంగా చూస్తే, ల్యాబ్-గ్రోన్ డైమండ్ల మార్కెట్ ప్రస్తుత వజ్రాల మార్కెట్ కంటే దాదాపు 50 రెట్లు విస్తరించే అవకాశం ఉంది. కాబట్టి ఇది మన దేశానికి ఒక గొప్ప అవకాశం అని చెప్పవచ్చు. వీటన్నింటికీ మించి దేశాన్ని ముందుకు నడిపించేందుకు సమర్థులైన పారిశ్రామికవేత్తలు మన దేశంలో ఉన్నారు. వజ్రాలను తయారు చేసే యంత్రాల ఉత్పత్తి నుంచి, ఆభరణాల రూపకల్పన, బ్రాండ్‌లను అభివృద్ధి చేయడం, ప్రపంచ వ్యాప్తంగా భారతీయ కంపెనీల షోరూమ్‌లను తెరవడం వరకు



ప్రతి ఒక్క అడుగు భారతీయ హస్తాల్లోనే ఉండాలి.”

**‘డీకాలనైజేషన్ అంటే గతాన్ని తుడిచిపెట్టడం కాదు’**

డీకాలనైజేషన్ అంటే కేవలం గతాన్ని తుడిచిపెట్టడం మాత్రమే కాదని, సత్యాన్ని భారతీయ కోణంలో ప్రామాణికంగా అందించడమేనని అమిత్ షా స్పష్టం చేశారు. దేశ చరిత్ర, సంప్రదాయాలు, భాషలు, పురావస్తు గ్రంథాలను కాపాడుకోవాలని, అలాగే వాటిని ప్రజల చెంతకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారు జ్ఞానాన్ని, అధికారాన్ని ఒకదానితో ఒకటి ముడిపెట్టారని, ఆ ఫ్రేమ్‌వర్క్ నుంచి జ్ఞానాన్ని విముక్తం చేయడమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యమని షా వ్యాఖ్యానించారు. ఒక దేశం ఎంత శక్తిమంతమైనదైనప్పటికీ, అది తన జ్ఞాపకాలు, చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి, భాషల, పురాతన గ్రంథాలను కాపాడుకోవడంలో విఫలమైతే ఎక్కువ కాలం మనుగడ సాధించలేదని స్పష్టం చేశారు. ఆదివారం, ముంబయిలోని ఆసియాటిక్ సొసైటీలో ‘గణేశ్? జ్ఞానార్థి’ ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు.

“నిజమైన జ్ఞానం ఎన్నడూ ఒక సిద్ధాంతానికి బందీ కాకూడదు. దాన్ని ఏ విధంగానైనా బంధిస్తే, అసలు జ్ఞానానికున్న అర్థాన్నే మార్చినట్లు అవుతుంది. కాబట్టి జ్ఞానం, దాని ప్రకటన స్వేచ్ఛగా, నిరభ్యంతరంగా ఉండాలి. చాలా కాలంగా భారతీయ జ్ఞానాన్ని వలసవాద దృక్పథంతోనే వివరించారు. ఫలితంగా భారతీయుల్లో ఒక రకమైన ఆత్మన్యూనతా భావం ఏర్పడింది. ఆసియాటిక్ సొసైటీ వంటి సంస్థలు ఈ జ్ఞానాన్ని పరిరక్షించి దేశం, ప్రపంచ శ్రేయస్సు కోసం ఉపయోగించడానికి సహాయపడతాయి.” ఈ సందర్భంగా, బీజేపీ నాయకుడు వినయ్ సహస్రబుద్ధే నేతృత్వంలోని ‘ఆసియాటిక్ సొసైటీ’ నూతన కమిటీకి షా ఒక సూచన చేశారు. సంస్థ వద్ద ఉన్న విస్తారమైన సమాచార భాండాగారాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. అలాగే, భారతీయ కోణంలో చారిత్రక పరిశోధనలు సాగించేందుకు వారిని ఈ సంస్థకు ఆహ్వానించాలని సూచించారు. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ సొసైటీలోని గ్రంథాలు, పత్రాలను డిజిటలైజ్ చేసి, దేశంలోని ఇతర గ్రంథాలయాలతో ఎలక్ట్రానిక్ పద్ధతిలో పంచుకోవాలని పిలుపునిచ్చారు. భారతీయ వారసత్వాన్ని పరిరక్షించే సంస్థలు, గ్రంథాలను అనుసంధానించే ఒక ఉమ్మడి వేదికను సృష్టించాలని, దానికి ఆసియాటిక్ సొసైటీ ప్రముఖ పాత్ర పోషించాలని ఆయన ప్రతిపాదించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లోని ఇళ్లలో ఉన్న తాళపత్ర గ్రంథాలు, పూర్వీకుల శాస్త్రాలను గుర్తించి, వాటిని జ్ఞాన్ భారతం జాతీయ తాళపత్ర గ్రంథ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని షా నొక్కి చెప్పారు. భారత ఆర్థిక, వ్యూహాత్మక పురోగతిని సుసంపన్నం చేసే జ్ఞానం తాళపత్ర గ్రంథాల్లో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మహాభారతం, జైన కల్పసూత్రం, బౌద్ధ గ్రంథాల సచిత్ర ప్రతులతో సహా ఆసియాటిక్ సొసైటీ వద్ద ఉన్న విస్తారమైన సేకరణలు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు, పరిశోధకులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. తాను కేవలం కేంద్ర హోం మంత్రిగా మాత్రమే కాకుండా, వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న భారతీయ జ్ఞాన సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంలో ఒక భాగస్వామిగా ఈ సొసైటీకి వచ్చానని షా పేర్కొన్నారు.

## దక్షిణాఫ్రికాతో ఆర్థిక బంధంపై ఫోకస్

దిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు జరిగిన వేళ, భారత ప్రధాని నరేంద్ర మోదీ పలువురు దేశాధినేతలతో వరుసగా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. కజకిస్థాన్ అధ్యక్షుడు కస్సిమ్- జొమార్ట్ టోకయేవ్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఉగాండా ఉపాధ్యక్షురాలు జెస్సికా అలుపో, బురుండి అధ్యక్షుడు ఎవరిస్టే న్డాయిషిమియేతో మోదీ భేటీ అయ్యారు. ఆ సమావేశాల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలు, ఆర్థిక సహకారం, ప్రాంతీయ పరిణామాలు, గ్లోబల్ సౌత్‌కు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి.

**టోకయేవ్‌తో కీలక చర్చలు**

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీ వచ్చిన కజకిస్థాన్ అధ్యక్షుడు టోకయేవ్‌తో మోదీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. భారత్-కజకిస్థాన్ మధ్య సంబంధాలకు మూడు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. 1992లో కజకిస్థాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన తొలి దేశాల్లో భారత్ కూడా ఒకటి. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంకేతిక సహకారానికి కూడా ఇరు దేశాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారత్ అందించిన ‘పరం బిలిమ్’ సూపర్ కంప్యూటర్‌ను కజకిస్థాన్‌లో అప్‌గ్రేడ్ చేసి 2025 జూన్‌లో తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో టోకయేవ్‌తో మోదీ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

**ఫిలిప్పీన్స్‌తో యాక్ట్ ఈస్ట్ దిశగా!**

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. ప్రస్తుతం ఆసియాన్‌కు ఫిలిప్పీన్స్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో మార్కోస్ భారత్‌కు వచ్చారు. ఆసియాన్‌తో భారత వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఫిలిప్పీన్స్ కీలకంగా ఉంది. ముఖ్యంగా వాణిజ్యం, సముద్ర భద్రత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అనుసంధానం వంటి అంశాల్లో భారత్-ఆసియాన్ సహకారం కొనసాగుతోంది. మోదీ యాక్ట్ ఈస్ట్ విధానంలో భాగంగా ఈ సంబంధాలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కోస్ భార్య లూయిస్ అరనెటా-మార్కోస్‌తో కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి కూడా సమావేశమయ్యారు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి, మహిళలను సమాన భాగస్వాములుగా ముందుకు తీసుకెళ్లాలన్న భారత్ ఆలోచనను ఆమె వివరించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసాతో మోదీ సమావేశమయ్యారు. బ్రిక్స్‌లో దక్షిణాఫ్రికా కీలక సభ్యదేశంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు, వాణిజ్య విధానాల్లో పరిణామాలు, సాంకేతిక అభివృద్ధి, వాతావరణ మార్పుల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు కొత్త అవకాశాలను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని రమాఫోసా ఇప్పటికే పేర్కొన్నారు. కేవలం ఒకరికొకరు వస్తువులు అమ్ముకోవడం మాత్రమే కాకుండా, ఉత్పత్తి, సాంకేతికత, పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో లోతైన భాగస్వామ్యాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మోదీ-రమాఫోసా భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఉగాండా, బురుండితోనూ భేటీలు**

ఉగాండా ఉపాధ్యక్షురాలు జెస్సికా అలుపోతో మోదీ భేటీ అయ్యారు. 2026 బ్రిక్స్ సదస్సులో పాల్గొంటున్న 10 భాగస్వామ్య దేశాల్లో ఉగాండా కూడా ఉంది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సు ద్వారా ఆఫ్రికా దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం జరుగుతోంది. ఆఫ్రికన్ యూనియన్ ప్రతినిధిగా బ్రిక్స్ సదస్సుకు హాజరైన బురుండి అధ్యక్షుడు ఎవరిస్టే న్డాయిషిమియేతోనూ మోదీ సమావేశమయ్యారు. గ్లోబల్ సౌత్ దేశాల ఉమ్మడి ప్రయోజనాలపై భారత్ దృష్టి పెట్టిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదే సమయంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్‌తో సమావేశమయ్యారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు చర్చించారు.

**ఇక మాటలు కాదు- చేతల్లో ఫలితాలు!**

మరోవైపు 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సందర్భంగా మోదీ కీలక సందేశం ఇచ్చారు. బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ప్రపంచం నుంచి ఈ కూటమిపై అంచనాలు మరింత పెరిగాయని చెప్పారు. ఇక కేవలం ఆలోచనలు, హామీలు చెప్పడం మాత్రమే సరిపోదని.. స్పష్టమైన ఫలితాలను చూపించాల్సిన సమయం వచ్చిందని మోదీ స్పష్టం చేశారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను నిర్దిష్ట కాలవ్యవధిలో అమలు చేయాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్‌పై గ్లోబల్ సౌత్ దేశాల నమ్మకం పెరుగుతోందని మోదీ అన్నారు. విపత్తుల నిర్వహణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సహకారం, పర్యావరణం వంటి రంగాల్లో భారత్ చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకుండా వ్యాపారవేత్తలు, రైతులు, పరిశోధకులు, మహిళలు, యువత, సామాన్య ప్రజలకు చేరాలని ఆకాంక్షించారు.

## చైనా విషయంలో కేంద్రం వ్యూహాత్మకంగా లొంగిపోతోంది



చైనా విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల ద్వైపాక్షిక సమావేశం జరిగిన మరుసటి రోజే, కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించింది. చైనా ముందు మోదీ సర్కార్ “వ్యూహాత్మకంగా లొంగిపోతోందని” కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. చైనా విషయంలో ప్రభుత్వ మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేదని ఆయన విమర్శించారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతలే ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు అత్యంత కీలకమని చైనా అధ్యక్షుడికి ప్రధాని మోదీ స్పష్టం చేసిన మరుసటి రోజే కాంగ్రెస్ ఈ విమర్శలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు జైరాం రమేశ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రధాని మోదీ ముందు నాలుగు కీలక ప్రశ్నలను ఉంచారు.

1. భారత భూభాగంలోకి ఎవరూ ప్రవేశించలేదని, మన పోస్టులు ఏవీ చైనా ఆధీనంలో లేవని 2020 జూన్ 19న మీరు చేసిన ప్రకటన, గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో చర్చల్లో మన స్థానాన్ని బలహీనపరిచిందా? తూర్పు లఢఖ్‌లోని అనేక ప్రాంతాల్లో సంప్రదాయ పెట్రోలింగ్, పశువుల మేత హక్కులను భారత్ కోల్పోయిందన్న ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి?
2. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబాట్లు పెరిగాయని, అనేక పెట్రోలింగ్ పాయింట్లకు మన సైనికులకు ప్రవేశం లేకుండా పోయిందని వార్తలు వస్తున్నాయి. అరుణాచల్‌లోని పట్టణాల పేర్లను చైనా మార్చడం, దానిని ‘దక్షిణ టిబెట్’గా పేర్కొనడం, బ్రహ్మపుత్ర నదిపై 60,000 మెగావాట్ల మెడాగ్ మెగా-డ్యామ్‌ను నిర్మించడం వంటి చర్యలతో మన ఈశాన్య రాష్ట్రాల నీటి భద్రతను ప్రమాదంలో పడేస్తున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది?
3. ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో పాకిస్థాన్‌కు చైనా అండగా నిలిచిందని 2025 జులై 4న ఆర్మీ ఉన్నతాధికారి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ స్పష్టంగా చెప్పారు. కానీ, 2026 ఆగస్టు 25న మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ దీనికి పూర్తి భిన్నమైన ప్రకటన చేశారు. చైనా అధ్యక్షుడి పర్యటనకు ముందు వాతావరణాన్ని మార్చే వ్యూహంలో భాగంగానే ఈ వైఖరిలో మార్పు వచ్చిందా?
4. చైనాతో మన వాణిజ్య లోటు రికార్డు స్థాయికి ఎందుకు చేరనిచ్చారు? 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు 112.6 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది మన పరిశ్రమలను, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ రంగాన్ని నాశనం చేస్తోంది. కీలకమైన ముడిసరుకులు, విడిభాగాల కోసం చైనాపై ఆధారపడటం ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ ఆమోదయోగ్యం కాని పరిస్థితిని మార్చడానికి మీ వద్ద ఉన్న రోడ్‌మ్యాప్ ఏమిటి?

ఈ ప్రశ్నలతో కాంగ్రెస్ పార్టీ, చైనా సరిహద్దు భద్రత, ఆర్థిక సవాళ్లపై కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా తప్పుబట్టింది. ఈ అంశాలపై ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది.

# ఏపీకి 'అల్పపీడనం' ముప్పు



ఎల్‌నినో ప్రభావంతో ముఖం చాటేసిన వరుణుడు కరుణిస్తుండటంతో ప్రజలు, రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శనివారం సాయంత్రం రాష్ట్రంలో అనేత ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. మరోవైపు అల్పపీడన ప్రభావంతో ఇవాళ ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని, 24 గంటల్లో ఇది విదర్భ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్పపీడన ప్రభావంతో నేడు(ఆదివారం) ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని చెప్పింది. దక్షిణ కోస్తాలో ఓ మోస్తరు వానలు, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోనసీమ జిల్లా మలికిపురంలో అత్యధికంగా 79.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరులోని శారదా కాలనీలో 50.18 మిల్లీమీటర్లు, ఎన్టీఆర్ జిల్లా గుణదలలో 49, కృష్ణా జిల్లా నందమూరులో 38.5, పోలవరం జిల్లా కూనవరంలో 32.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది.

తిరుమలలో భారీ వర్షం: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న వేళ తిరుమలలో భారీ వర్షం కురిసింది. తిరుమల వ్యాప్తంగా రోడ్లపై నీరు ప్రవహించింది. ఇటీవల వరుణయాగం పూర్తిచేసుకున్న అనంతరం శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటి ప్రవాహంతో కనిపించాయి. భక్తులు ఆలయ సమీపంలోని వాహన మండపం, రాంభగీచ ఎదురుగా ఉన్న షెడ్లలో తలదాచుకున్నారు. కొన్ని రోజులుగా ఎండవేడిమితో ఇబ్బంది పడుతున్న భక్తులు వర్షంతో ఉపశమనం పొందారు.

**కోనసీమలో జోరువాన**

అల్పపీడనం ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వర్షం దంచికొట్టింది. శనివారం జిల్లావ్యాప్తంగా సగటున 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆయుర్వేద వైద్యశాలల ముందు భారీగా వర్షపు నీరు నిలిచింది. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపంలో అమలాపురం- రావుల పాలెం ప్రధాన రహదారిపై చెట్టు కుప్పకూలింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు.

పొల్లూరు జలపాతం ప్రమాదకర స్థాయిలో: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. కొయ్యూరు, ముంచింగిపుట్టు, జీకే వీధి, పెదబయలు మండలాల్లో ఎడతెరిపిలేని వానలతో జనజీవనం స్తంభించింది. శనివారం కొయ్యూరులో 36.4 మిల్లీమీటర్లు, ముంచింగిపుట్టులో 28.6, జీకే వీధిలో 26.6, పెదబయలులో 19.4, చింతపల్లి 18.8, అరకులోయలో 12.2, పాడేరులో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పొల్లూరు జలపాతం ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. జలపాతం వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

**నీటిమునిగిన నిడదవోలు బస్టాండ్**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు బస్టాండ్ జలమయమైంది. చిన్నపాటి వర్షం కురిసినా బస్టాండ్‌లో నీరు నిలబడిపోతుంది. మురుగునీరుతో పాటు కలిసిపోయి ప్రాంగణంలో ప్రవహించడంతో ప్లాట్‌ఫామ్‌ల్లోకి చేరుకునేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే సమస్య వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఓసారి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కందుల దుర్గేష్ బస్టాండ్ నీట మునిగినప్పుడు పరిశీలించారు. సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించినా ఇప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్డాండ్‌లో వాన నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి విపత్తుల సంస్థ, ఆర్?టీజీఎస్ అందించే సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో రాకపోకలను నిలిపివేయాలని హోంమంత్రి దిశానిర్దేశం చేశారు.

# నాగబాబుకు జోడు పదవుల రచ్చ..



**గుంటూరు :** జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ (కేబినెట్ హోదా) కొణిదెల నాగబాబు చిక్కుల్లో పడ్డారా?. ఆయనకు జోడు పదవుల వివాదం తలనొప్పిగా మారబోతుందా?. సోషల్ మీడియా వేదికగా అదే చర్చ జరుగుతోంది.. జోడు పదవుల అంశం తెరపైకి వచ్చింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జోడు పదవులు ఉండకూడదంటూ సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చ మొదలైంది. గతంలో జయా బచ్చన్‌పై జోడు పదవులతో అనర్హత వేటు పడిందని.. ఎమ్మెల్సీగా ఉన్న నాగబాబుపై అనర్హత వేటు పడుతుందని కొందరు ట్వీట్‌లు చేశారు.ఏపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ నాగబాబును ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించి కేబినెట్ హోదా కల్పించింది. ఆయన జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి జీవోలో పేర్కొన్నారు. అయితే ఏదైనా ఉభయ సభల్లో సభ్యులుగా ఉన్నవారు ఇతర లాభదాయక పదవుల్లో ఉండకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ)ని గుర్తు చేశారు.. ఒక వ్యక్తి అటు కేంద్ర ప్రభుత్వంలో కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో కానీ లాభదాయకమైన పదవిలో ఉంటే.. వారి రాష్ట్ర శాసనసభ లేదా శాసనమండలి సభ్యుడిగా పదవిలో కొనసాగడానికి అనర్హుడవుతారని రాజ్యాంగంలో స్పష్టం ఉందని పేర్కొన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ హోదా, నెలకు 3.80 లక్షల రూపాయల జీతభత్యాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది నూటికి నూరు శాతం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) కిందకు వస్తుంది కాబట్టి ఎమ్మెల్సీ నాగబాబు మీద అనర్హత వేటు పడుతుందని చెప్పుకొచ్చారు. నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఉండగానే మళ్లీ ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి కేబినెట్ ర్యాంకుతో ఇవ్వడం, వేతనం పొందడం రాజ్యంగ విరుద్ధమనేది కొందరి వాదన.. ఇదే అంశాన్ని ట్వీట్‌లో ప్రస్తావించారు.గతంలో జయాబచ్చన్‌పై ఇలాగే అనర్హత వేటు పడిందంటున్నారు. జయా బచ్చన్ గతంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న సమయంలో.. మళ్లీ ఉత్తరప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ పదవి ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) పరిధిలోకి వస్తుందని ఎన్నికల సంఘం పేర్కొంది. జయా బచ్చన్ రాజ్యసభ ఎంపీ పదవిపై మార్చి 2006లో అనర్హత వేటు పడింది. జయా బచ్చన్ మాత్రమే కాదు మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయని చెబుతున్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ) ప్రకారం.. ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి ప్రభుత్వం నుంచి వేతనం, ప్రతిఫలం వచ్చే మరో లాభదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్)లో ఉండకూడదు. ఒకవేళ లాభదాయక పదవిని చేపడితే ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ రూల్‌నే ప్రధానంగా నాగబాబు విషయంలో ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో నాగబాబుపై అనర్హత వేటు పడకుండా ఏపీ ప్రభుత్వానికి మరో వెసులుబాటు కూడా ఉందనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ మినహాయింపు చట్టాన్ని ప్రధానంగా గుర్తు చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం.. రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేకంగా చట్టం చేసి కొన్ని పదవులకు ఈ అనర్హత నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కూడా ఉందని కొందరు గుర్తు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వేతనాలు, పింఛన్ల చెల్లింపు అనర్హతల తొలగింపు చట్టం, 1953 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లు, సొసైటీలు, కమిటీల ఛైర్మన్ పదవులను ఈ మినహాయింపు జాబితాలో చేరుస్తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవిని.. అనర్హతల తొలగింపు చట్టం ప్రకారం.. మినహాయింపు పొందిన పదవిగా గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు న్యాయపరంగా ఎలాంటి చిక్కులు ఉండవనే మరో వాదన తెరపైకి వచ్చింది. రెండు పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు ఒక పదవికి మాత్రమే ఆర్థిక వేతనం తీసుకోవడం, రెండో పదవికి అలవెన్సులను కేవలం అధికారిక ఖర్చులకు మాత్రమే పరిమితం చేయొచ్చు. అప్పుడు లాభదాయక పదవి వివాదం రాకుండా చూడొచ్చు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు పదవిని అనర్హతల తొలగింపు చట్టం పరిధిలోకి తీసుకొచ్చినా.. నిబంధనల ప్రకారం ఆర్థిక ప్రయోజనాల విషయంలో మార్పులు చేస్తే చట్టబద్ధమైన పదవిగా మారుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్న అంశాలపై ఏపీ ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# రేసులోకి వచ్చిన ఆనం

**నెల్లూరు :** నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌లోనే ఉన్నారు. ఆయన రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించలేదు. అయితే.. ఆయన రిటైర్ అవుతున్నారని.. ఆయన వారసుడు ఎవరు ? అంటూ.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం విషయం తరచుగా తెరమీదికి వస్తోంది. దెబ్బకు డిలీట్ ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నారని చెబుతున్నారు. కానీ, ఆనం ఎక్కడా అసలు ఈ విషయం చెప్పలేదని అంటున్నారు. రిటైర్మెంట్ గురించిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని అంటున్నారు. మంత్రిగా ఆయన ప్రస్తుతం ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనుల్లో (రోడ్ల విస్తరణ, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి) పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు ఆనం యూటర్న్ తీసుకున్నారన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. మరో మూడేళ్ల తర్వాత.. పోటీకి రెడీ కాలేరన్న వాదన సహజం. అయితే.. ఆత్మకూరుతో తనకు ఉన్న బంధం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి రెడీ అవుతానంటూ.. తన అనుచరులకు చెపుతున్నారట. కాబట్టి ప్రస్తుతానికి ఆత్మకూరు బరిలో వేరే వారు వస్తారనే ప్రశ్నే లేదు; ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేయనున్నారు.. అని అంటున్నారు.టీడీపీ ఆలోచన మరో విధంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆనం.. టీడీపీ తరపున ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణ యించింది. ప్రధానంగా.. నారా లోకేష్ నాయకత్వాన్ని పెంచే దిశగా సమాలోచనలు చేస్తున్న దరిమిలా.. వృద్ధ నేతలను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంను నామినేటెడ్‌పదవికి షిఫ్టు చేసి.. ఆత్మకూరును వేరే వారికి ఇచ్చే ఆలోచనలో ఉన్నారన్నది స్థానికంగా జరుగుతున్న చర్చ. కానీ, ఆనం మాత్రం.. ఈ విషయాలు వెలుగు చూస్తున్న క్రమంలో మరింత యాక్టివ్ అవుతుండడం గమనార్హం.

## కేంద్ర పథకాల నిధులపై ఏపీ ప్రభుత్వం కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

14,109 కోట్లు, 2025-2026లో రూ.15,126 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రాబట్టడంతో పాటు అవి సకాలంలో ఖర్చయ్యేలా సీఎం చంద్రబాబు ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ ఏడాది నాలుగో విడత నిధులు కేంద్రం నుంచి మంజూరు కావాల్సి ఉంది. ఆ మొత్తం కూడా సమకూరితే గత రెండు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తానికి సమానంగా ఈ ఒక్క ఏడాదిలోనే సాధించినట్లు అవుతుంది. 2024-2025, 2025-2026 ఆర్థిక సంవత్సరాల్లో ఉమ్మడి పథకాలకు కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.38,115 కోట్లు వెచ్చించారు. తద్వారా రెండు కోట్ల మందికి లబ్ధి చేకూరింది.

ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఏపీకి కేంద్ర పథకాల కింద తొలి విడతలో వచ్చిన రూ.8694 కోట్లు ఇప్పటికే వెచ్చించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10,552 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ కాగా, వాటికి రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి మొత్తం రూ.18,516 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 23 ప్రభుత్వ శాఖల్లో ఆరింటికి కేంద్రం ఈ సంవత్సరం రూ.1000 కోట్లకు మించి మంజూరు చేసింది. ఒక్క పంచాయతీరాజ్ శాఖకే రూ.11,184 కోట్లు మంజూరుకాగా, ఇప్పటికే రూ.4461 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమయ్యాయి. గృహనిర్మాణ శాఖకు రూ.2500 కోట్లు, ప్రాథమికోన్నత విద్యకు రూ.2351 కోట్లు, వైద్యారోగ్యశాఖకు రూ.2232 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.1398 కోట్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు రూ.1210 కోట్ల చొప్పున మంజూరయ్యాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా కేంద్రం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కింద వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో కేవలం రూ.2255 కోట్లు మాత్రమే వెచ్చించింది. ఈ పథకం గడువు ముగిసేలోగా ఏపీలోని 95.44 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరలేదు. ఎన్డీయే సర్కార్ ఏర్పడ్డాక కేంద్రంతో చర్చించి, పథకం గడువు పొడిగింపజేయడంతో పాటు నిధుల సాధనపై దృష్టి పెట్టింది. ఈ సంవత్సరం కేంద్రం రూ.2631 కోట్లు కేటాయించింది.

పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించే పోషణ్ 2.0 పథకంలో ఏపీకి రూ.971 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 20 లక్షల మందికిపైగా లబ్ధి కలగనుంది.

## రాష్ట్రంలో లోక్ అదాలత్‌కు భారీ స్పందన



-మొదటిపేజీ తరువాయి

జస్టిస్ లిసా గిల్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్ జస్టిస్ బట్టు దేవానంద్ మార్గదర్శకాల్లో రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాల్లో శనివారం 441 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. శనివారం సాయంత్రానికి రాజీకి అవకాశమున్న 2,22,770 కేసులను ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.

హైకోర్టు ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో మొత్తం నాలుగు లోక్ అదాలత్ బెంచ్‌లను నిర్వహించారు. జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ ఆలపాటి గిరిధర్, జస్టిస్ చింతలపూడి పురుషోత్తంకుమార్‌లు ఆయా బెంచ్‌లకు అధ్యక్షత వహించారు. 76 కేసులను పరిష్కరించారు. రూ.1.26 కోట్ల పరిహారం అందజేసేందుకు అవార్డులు జారీచేశారు. అలాగే విశాఖపట్నంలోని రుణ వసూళ్ల ట్రైబ్యునల్(డీఆర్టీ) బెంచ్‌లో 13 కేసులను పరిష్కరించి రూ.46.11 కోట్ల పరిహార చెల్లింపునకు అవార్డులు జారీచేశారు.

**సామరస్యపూర్వకంగా పరిష్కరించడం**

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గురజాల కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 43 ఏళ్లనాటి 71.51 ఎకరాల భూసేకరణకు సంబంధించిన అప్పీళ్లను సామరస్యపూర్వకంగా పరిష్కరించడం విశేషం. సుదీర్ఘ కాలం కొనసాగిన భూసేకరణ వివాదానికి పరస్పర అంగీకారంతో తెరపడింది. దీంతో భూములిచ్చిన రైతులకు ఉపశమనం లభించింది. మాచర్ల మండలం, కొత్తపల్లి గ్రామంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం 1983లో 71.51 ఎకరాలు సేకరించారు.

ఈ వ్యవహారమై గురజాలలోని పదో అదనపు జిల్లా కోర్టులో 24 అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఈ అప్పీళ్లను ఇరుపక్షాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. ఈ కేసులను పరిష్కరించుకోవడానికి ముందుకొచ్చిన రైతులు, పరిష్కార కార్యక్రమంలో పాల్గొన్న న్యాయాధికారులను గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పీడీజే) బి.సాయి కల్యాణ చక్రవర్తి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభినందించారు.

**గుంటూరు జిల్లా న్యాయశాఖ మరో రికార్డు**

రాష్ట్రస్థాయిలో సివిల్ కేసుల పరిష్కారంలో ఉమ్మడి గుంటూరు జిల్లా న్యాయశాఖ మరోసారి రికార్డు సృష్టించింది. జాతీయ లోక్ అదాలత్‌లో వరుసగా ఆరోసారి మొదటిస్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి కృషితో ఇది సాధ్యమైంది. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 1,041 సివిల్ కేసుల పరిష్కారంతో ఉమ్మడి గుంటూరు జిల్లా తొలిస్థానంలో, 489 కేసుల పరిష్కారంతో తూర్పుగోదావరి జిల్లా రెండో స్థానంలో, 446 కేసుల పరిష్కారంతో కృష్ణాజిల్లా మూడోస్థానంలో నిలిచాయి.

## పిడుగుపాటుతో నలుగురు మృతి..

పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు మరణించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొనడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారిని ఆదుకుంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

**అసలేం జరిగింది?**

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ ప్రకృతి బీభత్సంలో పిడుగులు పడి వేర్వేరు గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**మృతుల వివరాలు..**

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తలపనేని నాగమ్మ (63) ఇంటి సమీపంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఆ తీవ్రమైన శబ్దానికి భయపడి గుండెపోటుకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అదేవిధంగా, కాకాని శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ (60) కూడా తన ఇంటి వద్ద పిడుగు పడిన భారీ శబ్దానికి గుండె ఆగి మరణించారు. మరో రెండు ఘటనల్లో, పాలపాడు గ్రామానికి చెందిన రైతు దేరంగుల వెంకటయ్య, యాకలవారిపాలెంకు చెందిన మరో రైతు మజ్జిగ చిన్న కోటేశ్వరరావు పిడుగుపాటుకు నేరుగా గురై ప్రాణాలు విడిచారు. పొలాల్లో పనుల్లో ఉన్న సమయంలో ఈ దుర్ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పిడుగుల కారణంగా రెండు వేర్వేరు గ్రామాల్లో మూడు ఆటోలు, పలు కొబ్బరి, మామిడి చెట్లు కూడా దెబ్బతిన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

# అంచెలు అంచెలుగా జిల్లాల స్థాయికి ఎదిగిన (డోన్ ఏపీ జేపీఎస్)

**డోన్ (ప్రజా జ్యోతి )సెప్టెంబర్ 3**నంద్యాల జిల్లా డోన్ పట్టణం జర్నలిస్టుల గళానికి మరింత బలం ఏపీ జేపీఎస్‌లో కొత్త కమిటీలు! అన్నవరంలో జోనల్, జిల్లా కమిటీల నియామకం.. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న జర్నలిస్టుల పరిరక్షణ సమితి

**అన్నవరం, కాకినాడ జిల్లా:**
జర్నలిస్టుల హక్కులు, వారి పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి (ఏపీ జేపీఎస్) తన కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా అన్నవరం నియోజకవర్గ కేంద్రంలో జోనల్, జిల్లా కమిటీల నియామక కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, డోను నియోజకవర్గ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై నూతనంగా నియమితులైన జోనల్, జిల్లా కమిటీ బాధ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలోనే ఏపీ జేపీఎస్ జర్నలిస్టుల నుంచి విశేష ఆదరణ పొందడం సంస్థ బలానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టులపై ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురైనప్పుడు వారికి అండగా నిలవడంతో పాటు, వారి హక్కుల పరిరక్షణ కోసం ఏపీ జేపీఎస్ నిరంతరం



పనిచేస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టు సమస్యలపై రాజీ లేని పోరాటమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన కమిటీలు తమ పరిధిలోని పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ, సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడుతూ.. జోనల్ కన్వీనర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు ఏపీ జెపిఎస్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించి బలోపేతం చేయాలని వారు సూచించారు అనంతరం ఏపీ జేపీస్ లోగ్ ను అన్నవరంలో ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఏపీ జేపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివరామయ్య ఆచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి. మూర్తి, శ్రీదేవి ఈశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి విజయ్, సహకార కార్యదర్శి ప్రసాద్ యాదవ్, రాష్ట్ర కోశాధికారి జయకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రంగన్న గౌడ్,కే శ్రీనివాసులు యాదవ్, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సుధాకర్, కోశాధికారిశ్రీనివాసులు యాదవ్,తదితరులతో పాటు కాకినాడ జిల్లాకు చెందిన పలువురు పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏపీజేపిఎస్ సమితి సంఘంలో చేరారు అని తెలిపారు,

# ప్రజా సంక్షేమమే లక్ష్యం.....టీడీపీ బలోపేతమే ధ్యేయం

## సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ చేరాలి ఆలూరులో టీడీపీ క్యాడర్ సమావేశం
## పార్టీ బలోపేతంపై ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి దిశానిర్దేశం

**ఆలూరు/హోళగుంద, సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి న్యూస్ –** ఆలూరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంపై క్యాడర్‌తో విస్తృతంగా చర్చించారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని వైకుంఠం జ్యోతి క్యాడర్‌కు సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా కార్యకర్తలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు.

**పెన్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి**







ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంపై అర్హులైన ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆమె సూచించారు.టీడీపీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యం.....టీడీపీ బలోపేతమే ధ్యేయం అనే నినాదంతో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు వినాయక చవితి శుభాకాంక్షలు



**కర్నూలు సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి న్యూస్ )** స్టాఫ్ రిపోర్టర్ కర్నూలు జిల్లా ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి.పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు.. షేర్ చేయవద్దు.రేపు (సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం) వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బంది మీడియా మిత్రులకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలందరూ సోదరభావం,మత సామరస్యంతో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని వినాయక మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు,నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,విగ్రహాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని,రాత్రి వేళల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిబంధనల మేరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని,అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు,మత పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు,మీడియా మరియు అన్ని వర్గాల వారు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియా,వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అసత్య ప్రచారాలు,వదంతులను ప్రజలు నమ్మవద్దని,వాటిని ఇతరులకు షేర్ చేయకుండా నిజానిజాలను నిర్ధారించుకునేందుకు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసులకు, డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.

# మాజీ ఎంపిటిసి కురువ కోటప్ప మృతికి నివాళులర్పించిన, ఉమామహేశ్వర నాయుడు





**కంబదూరు సెప్టెంబర్:13(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు:** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కురువ కోటప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మదినేని ఉమామహేశ్వర నాయుడు, తిమ్మాపురంలోని మృతుని నివాసానికి చేరుకొని, కోటప్ప భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఉమామహేశ్వర నాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్యప్ప, దురద కుంట బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ హరినాథ్, పైడిపాటి రాము, చిరంజీవి, మహేష్, గోవింద, శ్రీనివాసులు, మైలార్, తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని నివాళులర్పించారు.

# గణేష్ ఉత్సవాలలో మట్టి వినాయక ప్రతిమలను వినియోగిద్దాం

## - పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుదాం
## - మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన వైఎస్ఆర్ సీపీ నాయకులు

**చెన్నూరు సెప్టెంబర్ 13:-** గణేష్ ఉత్సవాలలో మట్టి వినాయక ప్రతిమలను వినియోగిద్దాం పర్యావరణ పరిరక్షణలో మనమంతా భాగ్యస్వామ్యం అవుదామని వైఎస్ఆర్సిపి కమలాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మల్ల సాయి కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్ఆర్సిపి కమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ పోచం రెడ్డి నరేన్ రామాంజుల రెడ్డి ఆదేశాల మేరకు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని చెన్నూరు రెండవ సెగ్మెంట్ లో గల 7, 8, 9, 10 వార్డులకు సంబంధించి శివాలయం వీధిలో వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి గుమ్మల సాయి కుమార్ రెడ్డి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో మనమంతా భాగస్వామ్యం కావాలని అందుకే మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగిద్దామని, ప్లాస్టిక్ రహిత సమాజానికి తోడ్పడదామని ఆయన అన్నారు. మనమందరం గణేష్ ఉత్సవాలలో పర్యావరణ సహిత మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహిస్తూ, వారికి అవగాహన కలిగే విధంగా ఆవరణంలో ప్లాస్టిక్ వల్ల ఏర్పడే ఇబ్బందులను గురించి వివరించాలని ఆయన కోరారు. ఇలాంటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల నష్టాలను గురించి ఆయన వివరించారు. వీటివల్ల చెరువులు, నదులు ఇతర జన వనరులు కాలుష్యం కావడం



తో, తద్వారా ఎన్నో జీవరాసులకు ప్రాణహాని కలుగుతున్నదని ఆయన తెలియజేశారు. మట్టి విగ్రహాలు వాడటం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని ఆ దిశగా ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ జి ఎన్ భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు చీర్ల సురేష్ కమలాపురం నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్ ప్రెసిడెంట్ మిట్టా. మాధవ రెడ్డి గుమ్మల్ల మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి ,హరి వర్మ వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పసుపులేటి వారి వీధిలోని వినాయక చవితి ఉత్సవ కమిటీవారికి రూ.10 వేలు చందా ఇచ్చిన డాక్టర్ చల్లా.



**ఆలమూరు సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి):**వినాయకచవితి పండగ వేళ జరుగుచున్న గణపతి నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రం ఆలమూరు లోని పసుపులేటి వారి వీధిలో ఏకదంతాయ యూత్ వినాయక చవితి ఉత్సవ కమిటీవారికి ఆదివారం రూ.10 వేలు చందా ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చల్లా తనయుడు యువ పారిశ్రామికవేత్త చల్లా సుధీర్ కుమార్,పైడికొండల దుర్గాప్రసాద్,పైడికొండల వెంకటేష్, చిన్నం సాయి ఆదిత్య,ఆచంట నాగ సాయి,టేకి శివగణేష్,కాశిపూడి రామకృష్ణ,కొమ్మిశెట్టి సుధీర్,కొమిశెట్టి పృధ్వి,బాదంపూడి గణేష్,బాదంపూడి అంజి,చిన్నం వాసు,కొమ్మిశెట్టి నందకిషోర్,పాముల కుమార్ సాయి,పాముల యశ్వంత్,పందిరి సందీప్,షేక్ అలీ,ఆదుర్తి శ్రీను,మారిశెట్టి నాగేంద్ర,మారిశెట్టి వీరబాబు,చిన్నం త్రినేష్,షేక్ వల్లి,రేలంగి దుర్గ సాయి మార్గాని రాకేష్,వాస కేశవ,వాస కుమార్, షేక్ కరిముల్లా,మిత్తన బన్నీ,మిత్తన సన్నీ, కాశి గుడి వెంకీ,పంతాల సూర్య,పంతాల నాగేంద్ర,గుత్తుల సంతోష్,కడియాల వెంకటేష్, చిన్నం హర్ష,చల్లా కిషోర్,చల్లా నవీన్,చిన్నం బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలమూరు లో జరిగిన లోక్ అదాలత్ లో రూ. 52.75లక్షలు విలువ చేసే 504 కేసులు పరిష్కారం.



**ఆలమూరు సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి):**ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్ లో 504 కేసులను పరిష్కరించగా రూ.52,75,263 విలువైన ఆర్థిక లావాదేవీలు పరిష్కారమయ్యాయి.స్థానిక కోర్టు న్యాయమూర్తి ఐ ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్ లో చాలా కేసులను పరిష్కరించారు. అనంతరం కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసు కమిటీ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య, రక్త పరీక్షలు జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షరీఫ్,ప్రధాన కార్యదర్శి చల్లా సతీష్ తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


## వివాహ నిశ్చితార్థం కార్యక్రమానికి హాజరైన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి




**సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జీ శ్రీనివాస్ నాయుడు :-** మాజీ హహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు కుమారుడు నిచ్చితర్థము డోన్ పట్టణ్ములోని ఎం కన్వెన్షన్ అల్ లో జరిగింది. ఈ కార్య క్రమానికి అజరు ఐ వధువరాలను అశ్విదిరించిన ఉరవకొండ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పిఎసి మెంబెర్ వై విశ్వేశ్వర రెడ్డి ఉరవకొండ ఇంచార్జ్. అలాగే కె.వి రమణ గారు సిపి వీరన్న మరియు వైసీపీ నాయకులు పాల్గొనడం జరిగింది అనే పత్రిక విలేకరులకు తెలియజేశారు.

## పామిడిలో ప్రైవేట్ కంటి ఆసుపత్రి ప్రారంభం

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** స్థానిక పామిడి పటణంలోని బీసీసీ రోడ్ స్టేట్ బ్యాంక్ సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీస్కంద కంటి ఆసుపత్రిని ఆదివారం మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా చేతుల మీదగా ఘనంగా ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ హరికృష్ణ,డాక్టర్ నిఖితకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా శ్రీస్కంద కంటిపరీక్ష కేంద్రంలో స్వదేశీ విదేశీల అత్యాధునిక పరికరాలతో కంటి వైద్యం దూరం దగ్గర చూపుకు, కంటి నుంచి నీరుకారడం, మైగ్రేన్ తలనొప్పి, కంటి శుక్లాలను గుర్తించుట, కొయ్య కొండను గుర్తించుట, కంటిలోని నలుసులను తొలగించుట,గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు స్క్రీనింగ్ పరీక్షలు చేయుట, కండ్ల కలక, కంటీ









అలర్జీకి (దురదలు) చిన్నపిల్లలకు ప్రత్యేకంగా రెటీనా స్కోప్ తో పరీక్షలు చేయుట, మా ఆస్పత్రి యొక్క ప్రత్యేకతలుగా తెలుపుతూ ప్రతి నెల మొదటి వారంలో రెటీనా వైద్య నిపుణుల చేత (షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం) పరీక్షలు నిర్వహించుట జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి రాత్రి 8 గంటల వరకు వైద్యం చేయబడును పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కంటి జబ్బు ప్రజలకు అనుకూలంగా ఏర్పాటు చేయడమైనది అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికృష్ణ డాక్టర్ నిఖిల్ కృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌష్ పీరా, ఆర్మీ షఫీ, రాధాకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గం వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం

-మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ సమన్వయకర్త గౌ!!శ్రీ మెట్టు గోవిందరెడ్డి గారి అధ్యక్షతన జరిగిన సమావేశం



**సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-**రాయదుర్గం నియోజకవర్గం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించిన నేతలు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం.పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధతపై కేడర్ కు దిశా నిర్దేశం చేసిన మాజీ శాసన సభ్యులు మెట్టు గోవిందరెడ్డి గారు.మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ గెలుపే లక్ష్యం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ వైసీపీ కార్యకర్త పనిచేయాలని రాయదుర్గం సమన్వయకర్త గౌ!!శ్రీ మెట్టు గోవిందరెడ్డి గారు పిలుపునిచ్చారు. రాయదుర్గంలో ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఆదివారం పార్టీ శ్రేణులతో నిర్వహించారు. రెండున్నర ఏళ్లలో అధికార చేసిన పార్టీ దౌర్జన్యాలను ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని హితువు పలికారు,అన్ని చోట్లా గెలుపొందేలా కృషి చేయాలని. పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రజాప్రతినిధులకు తాజామాజీ సర్పంచులకు పార్టీ పార్టీ శ్రేణులకు తెలియజేసారు.అనంతరం పార్టీ వివిధ హోదాలలో పదవులు పొందిన నాయకులకు ఐడి కార్డులను పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

-ఎస్సై చెన్నారావు నిర్వాహకులకు సూచనలు-



**బుట్టాయగూడెం సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి):-** వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బుట్టాయిగూడెం ఎస్సై పి.చెన్నారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.మండపాల వద్ద నిషేధిత డీజే సౌండ్ బాక్సులను ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు.నిమజ్జన ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అన్నారు.వినాయకుడి మండపాల వద్ద అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడినా,నిబంధనలను ఉల్లంఘించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.అనంతరం ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూనే, చట్టాన్ని గౌరవిస్తూ సంయమనంతో వేడుకలు నిర్వహించాలని ఆయన సూచించారు

## వైస్సార్సీపీ పార్టీ కి చెందిన కార్యకర్త ను పరమార్శించిన యం. యం. హాళ్ళి గ్రామ నాయకులు



**సెప్టెంబర్ 13 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** అనంతపురం జిల్లా ,కుడేరు మండలం,జయపురం గ్రామానికి చెందిన వైస్సార్సీపీ కార్యకర్త జయపురం మారుతి కు కడుపు నొప్పి రావడం తో అనంతపురంలోని ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నడాని విషయం తెలుసుకున్న యం.యం. హాళ్ళి గ్రామ వైసిపి నాయకులు ఉపసర్పంచ్ అక్కులన్న,కె.ఎర్రిస్వామి,సి.కుళ్ళాయస్వామి, వై,విష్ణు అందరూ కలసి వారిని పరమార్శించి వారికి ధైర్యం కల్పించిన అధైర్యం పడకుండా ఉండాలని స్థానికంగా పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు.

## ఉరవకొండ నియోజకవర్గం ప్రజానీకానికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి

**సెప్టెంబర్ 13 ప్రజాజ్యోతి రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం ప్రజానీకానికి మరియు అధికారులకు ప్రజా ప్రతినిధులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మిత్రులకు శ్రేయోభిలాషులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ అలాగే ఆ గణనాథుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని మరియు ఈ సంవత్సరం ఆ గణనాథుని ఆశీస్సులతో రైతులు సుభిక్షంగా ఉండాలని పంటలు బాగా పండాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి ఆ గణనాథుని వేడుకున్నట్లు తెలిపారు.



# రామలమ్మ దేవి ఆలయానికి మహా శుభారంభం





**శ్రీ రామలమ్మ దేవి ఆలయ నిర్మాణానికి వైకుంతం జ్యోతి చేతుల మీదుగా భూమిపూజ**

**టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సహాయం**

**ఆలూరు/హోళగుంద, సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి న్యూస్ -** ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో శ్రీ రామలమ్మ దేవి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ.20 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించనున్న ఆలయ నిర్మాణ పనులకు ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంతం జ్యోతి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి అవసరమైన పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ రామలమ్మ దేవి ఆలయం నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందడంతో పాటు, భక్తులకు సౌకర్యవంతమైన దైవదర్శనం అందుబాటులోకి వస్తుందని వారు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైకుంతం జ్యోతి ముందుకు సాగుతున్నారని గ్రామ ప్రజలు అభినందించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

**గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి.....డీఎస్పీ వెంకట్రామయ్య....**

**హోళగుందలో పీస్ కమిటీ సమావేశం....హాజరైన డిఎస్పి, సి ఐ**





**హోళగుంద, సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి న్యూస్:-** పండుగలను ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో కలిసి మెలిసి జరుపుకుందామని పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య, ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి, హోళగుంద ఎస్ ఐ దిలీప్ కుమార్ అన్నారు.వినాయక చవితి గణేష్ ఉత్సవాల సందర్భంగా హోళగుంద ఎస్సై దిలీప్ కుమార్ పోలీస్ స్టేషన్ ఆవరణశీ నందు గ్రామస్తులతో పీస్ కమిటీ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పత్తికొండ డివిజన్ డిఎస్పి వెంకటరామయ్య, ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి పోలీసు అధికారులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ఆహ్లాదకరమైన వాతావరణంలో సోదర భావంతో కలిసిమెలిసి ఆనందంగా జరుపుకుందామని అన్నారు. వినాయక మండపాలను ఏర్పాటు చేయదలచిన వారు అనుమతి కొరకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్సైట్ నందు తమ వివరాలు నమోదు చేసి అనుమతి పొందాలని అన్నారు. సోషల్ మీడియా లో వ్యాప్తి చెందే వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో ఇతరులు పోస్ట్ చేసిన సందేశాలను ఉద్దేశించి వ్యతిరేక ధోరణిలో మెసేజ్ లు పెట్టడం చేయకూడదని సూచించారు. ఎవరైనా ఇబ్బందికరంగా పోస్టులు పెడితే పోలీసులకు సమాచారం అందించాలని అలాంటి వారిపై పెట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల దగ్గర ప్రమాదకరంగా మారే విద్యుత్ తీగలకు, లైట్లకు పిల్లలను దూరంగా ఉంచాలని, మండపాల దగ్గర తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. సోదరభావంతో ఇతర మతస్తులను, వారి ఆచారాలను గౌరవిస్తూ, ఇతరుల మనోభావాలకు భంగం కలగకుండా వ్యవహరిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో పండగలు చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. నిమజ్జనం ఊరేగింపులో డీజే లకు అనుమతి లేదని, నిబంధనలో అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి, హోళగుంద గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తిరుపతిలో పారామెడికల్ విద్యార్థినిపై పోలీసుల వైఖరి సిగ్గుచేటు

**ఎ ఐ యస్ యఫ్ జిల్లా అధ్యక్షురాలు కే. యామిని దేవి శ్రీ.**



**పాలకొల్లు. ప్రజాజ్యోతి సెప్టెంబర్ 13.** తిరుపతి లో స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ తిరుపతి అలిపిరి వద్ద ఆందోళన చేస్తున్న పారా మెడికల్ విద్యార్థులపై పోలీసు లు తీవ్ర బలప్రయోగానికి దిగడం దారుణమని ఎ ఐ యస్ యఫ్ రాష్ట్ర గరల్స్ కో-కన్వీనర్, పశ్చిమగోదావరి జిల్లా ఎ ఐ యస్ యఫ్ అధ్య క్షురాలు కే. యామిని దేవి శ్రీ అన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఒక విద్యార్థినిని ఎస్ఐ జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్ళటం విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చెయ్యటం విద్యార్థి నాయకులపై జులుం ప్రదర్శించటం తమను తీవ్రంగా కలచివేశాయని యామిని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. సమస్యల పరిష్కరానికి నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం ఎంతవరకు సమంజసమని యామిని ప్రశ్నించారు. స్టైపెండ్ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల పోలీసులు సంయమనంతో వ్యవహరించాల్సింది పోయి, విద్యార్థినిని జుట్టు పట్టుకుని ఈడ్చడం అత్యంత అవమానకరమైన చర్య అని ఆమె పేర్కొన్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, విద్యార్థినిపై దురుసుగా వ్యవహరించిన పోలీసు అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పారామెడికల్ విద్యార్థుల పెండింగ్ స్టైపెండ్‌లను వెంటనే విడుదల చేసి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారానికి ప్రశ్నిస్తే వారిని అణచివేయాలని చూడటం బావ్యం కాదని వారి సమస్యలను పరిష్కరించాలని చూడాలని యామిని అన్నారు. విద్యార్థులపై ఎలాంటి బలప్రయోగాన్నైనా ఎ ఐ యస్ యఫ్ తీవ్రంగా ఖండిస్తుందని యామిని దేవి శ్రీ స్పష్టం చేశారు.

## పేద కుటుంబానికి జై భీమ్ యువసేన ఫౌండేషన్ వితరణ

**రూ 15,000 ఆర్థిక సహాయం అందజేత.**



**పాలకొల్లు ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం సెప్టెంబర్ 13.** కష్టాల్లో ఉన్న ఒక పేద కుటుంబానికి మానవతా దృక్పథంతో జై భీమ్ యువసేన ఫౌండేషన్ అండగా నిలిచింది. యలమంచిలి మండలం, నార్ని మెరక పంచాయతీ, కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన భూపతి తులసమ్మ (52) గత రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా కూలిపని చేసుకుని జీవనం సాగించే ఆమె భర్త నాగేశ్వరరావు ఎన్నో ఆసుపత్రుల్లో చికిత్స కోసం స్థాయికి మించి ఖర్చు చేసినప్పటికీ ఆమె ప్రాణాలను కాపాడుకోలేకపోయారు. నాలుగు రోజుల క్రితం తులసమ్మ మృతి చెందటంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. వారి కుటుంబానికి కొంతైనా ఆత్మస్థైర్యం, ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో జై భీమ్ యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రెండవ సాయంగా రూ 15 వేలు ఆర్థిక సాయాన్ని జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెడ్డం సునీల్ గవాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి అండగా నిలవడం తమ పౌండేషన్ మానవతా బాధ్యత అన్నారు.ప్రతి నెలా సామాజిక సేవను కొనసాగించడానికి సహకరిస్తున్న సభ్యులందరికీ అయన ధన్యవాదాలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు రాయపూడి భవాని ప్రసాద్ మాట్లాడుతూ మనిషికి మనిషి తోడుగా నిలవడమే నిజమైన మానవత్వం. జై భీమ్ యువసేన ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆపదలో ఉన్న కుటుంబాలకు కొంత ఊరటను అందిస్తున్నాయన్నారు. పంచాయతీ మాజీ సర్పంచ్ వలవల విష్ణు బాలాజీ మాట్లాడుతూ జై భీమ్ యువసేన ఫౌండేషన్ ఆపద సమయంలో పేద కుటుంబానికి సహాయం అందించడం అభినందనీయమన్నారు. . ఫౌండేషన్ చేస్తున్న మానవతా సేవలకు మా పూర్తి సహకారం ఉంటుంద ని అన్నారు జై భీమ్ బుద్ధ యువజన సంఘం అధ్యక్షులు అరిగేలా రవి, డ్వాక్రా సి ఎ చిట్టమ్మ, ఉపాధ్యాయురాలు అశ్విని, ఏసేపు , మొదలగువారు పాల్గొన్నారు

# ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు

## మండపాలు నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు కలెక్టర్ వినోద్‌కుమార్

**బాపట్ల సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)** జిల్లాలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవ ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ బంగ్లా నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పండుగ ఏర్పాట్లు, విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనంపై సమీక్షించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందస్తుగా సంబంధిత శాఖల అనుమతులు తీసుకుని, నిబంధనలకు అనుగుణంగా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండపాల వద్ద పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా వైరింగ్ సురక్షితంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, లైటింగ్, గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది, బోట్లు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన మార్గాల్లో రహదారులపై గుంతలను పూడ్చి, అవసరమైన చోట క్రేన్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఊరేగింపుల్లో డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు, సమయ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ సందర్భంగా అన్ని వర్గాల ప్రజల మత విశ్వాసాలను గౌరవిస్తూ సోదరభావం, సామరస్యంతో వేడుకలు నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్, థర్మోకోల్ వంటి పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిమజ్జనాన్ని నిర్దేశిత ప్రాంతాల్లోనే నిర్వహించి, పూజా సామగ్రిని నీటిలో వేయకుండా ప్రత్యేకంగా సేకరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం అనంతరం ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా వినాయక చవితి సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు సోమవారం కలెక్టరేట్‌కు అర్జీలు తీసుకుని రావద్దని సూచించారు. జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు ఏ.హరికుమార్, నరసింహారావు, బి.శ్రీదేవి, డీపీఓ ఎల్.ప్రభాకర్‌రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, జిల్లా రవాణా శాఖ అధికారి పరందామరెడ్డి, డీఎస్పీలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# గొల్లప్రోలులో జనసేన జోరు: 12, 13, 14, 15 వార్డుల్లో నేతల విస్తృత పర్యటన





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పురపాలక సంఘం జనసేన పార్టీ శ్రేణులు మున్సిపల్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఆదివారం పట్టణంలోని 12, 13, 14, 15 వార్డులలో జనసేన పార్టీ నాయకులు బుర్రా దివ్యరాజ్ మెడ శెట్టి సూర్య కిరణ్ ( బాబీ ) మల్లాడి రాజేంద్రప్రసాద్ గొల్లప్రోలు టౌన్ జనసేన పార్టీ ఇంచార్జ్ మామిడాల సూరిబాబు జనసేన పార్టీ ముఖ్య నాయకులు వార్డు ఇన్చార్జులు వీర మహిళలు కార్యకర్తలు పర్యటించారు ఈ పర్యటన అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. వార్డుల్లోని ప్రతి ఇంటికీ వెళ్లిన నాయకులు, ప్రజలతో నేరుగా మమేకమై వారి సాధకబాధకాల ను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పరిపాలన ఎలా ఉందనే అంశంపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించారు. ఈ పర్యటనలో భాగంగా జనసేన నాయకులు ఆయా వార్డుల ప్రజలను కలిసి పలు కీలక అంశాలపై చర్చించాలు. ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను, వారి స్పందనను అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, అందిస్తున్న పాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు ఎంతవరకు అందుతున్నాయి? అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందా లేదా? అనే విషయాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. వార్డుల్లో డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి ఏవైనా స్థానిక సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ఎవరికి వేస్తారనే అంశం పై జనసేన పార్టీకి మద్దతు ఇవ్వాలని, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పర్యటన మధ్యలో జనసేన నేతలు స్థానిక యువతతో కాసేపు ప్రత్యేకంగా మాట్లాడారు. నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, క్రీడా మైదానాల ఏర్పాటు వంటి అంశాలపై యువత తమ అభిప్రాయాలను నేతలతో పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా యువత అంతా రాజకీయాల్లో క్రియాశీలకంగా మారాలని, గొల్లప్రోలు పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన వార్డు కౌన్సిలర్లు, నియోజకవర్గ, పట్టణ స్థాయి జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొని పర్యటనను విజయవంతం చేశారు.

# పర్యావరణ రక్షకుడి ‘జాతీయ వినాయకుడు’!

**బియ్యం అక్షింతలతో తాపీమేస్త్రి అద్భుత సృష్టి.. 15 ఏళ్లుగా ప్రకృతి పరిరక్షణకు వినూత్న బాట**

**మట్టి నుంచి వరిపిండి వరకు.. రుద్రాక్షలు, పసుపుతో గణనాథుడి రూపాలు.. ఈసారి త్రివర్ణ పతాకంతో దేశభక్తి చాటిన కోలా వీరబాబు**

**గొల్లప్రోలు, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు పెద్ద పెద్ద ప్రసంగాలు అవసరం లేదు.. మన చేతల్లో చూపించే చిన్న ప్రయత్నమే సమాజంలో పెద్ద మార్పుకు నాంది పలుకుతుంది. దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు కాకినాడ జిల్లా గొల్లప్రోలుకి చెందిన కోలా వీరబాబు. వృత్తిరీత్యా తాపీమేస్త్రి అయిన ఆయన.. తన వృత్తితో జీవనం సాగిస్తూనే గత 15 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణను తన బాధ్యతగా భావిస్తూ వినాయక చవితి సందర్భంగా ప్రకృతికి హాని కలిగించని పదార్థాలతో వినూత్న గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వినాయక విగ్రహం రూపకల్పనలో కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టే వీరబాబు.. ఈ ఏడాది మరింత ప్రత్యేకమైన ఆలోచనతో అందరి దృష్టిని ఆకర్షించారు. రైతు పండించిన బియ్యాన్ని అక్షింతలుగా ఉపయోగించి, భారత జాతీయ జెండాలోని మూడు రంగుల స్ఫూర్తితో ‘జాతీయ వినాయకుడు’గా గణనాథుడిని తీర్చిదిద్దారు. పర్యావరణ పరిరక్షణ సందేశంతో పాటు దేశభక్తిని కూడా చాటిచెప్పేలా రూపొందించిన ఈ విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

### 15 ఏళ్లుగా.. ప్రకృతితో మమేకమై గణనాథుడి రూపాలు

వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే భారీ విగ్రహాలు, వాటికి వినియోగించే రసాయన రంగులు నిమజ్జనం అనంతరం చెరువులు, కాలువలు, ఇతర జలవనరులను కలుషితం చేస్తున్నాయన్న విషయాన్ని వీరబాబు గుర్తించారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రకృతికి హాని చేయని వస్తువులతోనే గణనాథుడి విగ్రహాలను తయారు చేయాలనే సంకల్పం తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది తన సృజనాత్మకతకు పదును పెడుతూ వినూత్నమైన పర్యావరణ వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. గతంలో మట్టి, వరిపిండి, రుద్రాక్షలు, పసుపు ముద్దలు, పసుపు కొమ్ములు వంటి సహజ పదార్థాలతో గణనాథుడి విగ్రహాలను రూపొందించి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ విగ్రహాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఏడాది వీరబాబు ఆలోచన మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. రైతు చెమటతో పండించిన బియ్యాన్ని అక్షింతలుగా ఉపయోగిస్తూ.. అదే బియ్యంతో గణనాథుడి రూపాన్ని తీర్చిదిద్దారు. అంతేకాకుండా భారత జాతీయ జెండాలోని త్రివర్ణ స్ఫూర్తిని విగ్రహ రూపకల్పనలో ప్రతిబింబిస్తూ దేశభక్తిని చాటిచెప్పారు. భక్తి.. ప్రకృతి పరిరక్షణ.. రైతు కష్టం.. దేశభక్తి–ఈ నాలుగు అంశాలను ఒకే వినాయక విగ్రహంలో మేళవించిన వీరబాబు సృజనాత్మకత స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా వినాయక విగ్రహాలను తయారు చేసే విధానానికి భిన్నంగా, అందుబాటులో ఉన్న సహజ పదార్థాలను వినియోగిస్తూ రూపొందించిన ఈ ‘జాతీయ వినాయకుడు’ పర్యావరణ హితానికి ప్రతీకగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా విగ్రహ రూపశిల్పి, పర్యావరణ ప్రేమికుడు కోలా వీరబాబు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “నీరు మన జీవితానికి ఆధారం. మన అవసరాల కోసం ఉపయోగించే చెరువులు, జలవనరులను మనమే కలుషితం చేయడం సరికాదు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. అందుకే గత 15 ఏళ్లుగా ప్రకృతికి హాని చేయని పదార్థాలతోనే వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాను. నా వంతుగా నేను చేస్తున్న ఈ చిన్న ప్రయత్నం మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి” అని ఆయన తెలిపారు. వృత్తిరీత్యా తాపీమేస్త్రి అయినప్పటికీ.. పర్యావరణ పరిరక్షణపై ఇంతటి బాధ్యతతో వ్యవహరిస్తూ, తన సృజనాత్మకతను సమాజ ప్రయోజనానికి వినియోగిస్తున్న కోలా వీరబాబు ప్రయత్నాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. ప్రకృతిని




కాపాడటానికి పెద్ద సంస్థలు, భారీ నిధులు అవసరం లేదని.. మనసుంటే సాధారణ వ్యక్తి కూడా తన స్థాయిలో గొప్ప మార్పుకు బాటలు వేయగలడని వీరబాబు నిరూపిస్తున్నారు. భక్తితో పూజించే గణనాథుడిని పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మలచడం ద్వారా ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయం అని స్థానిక ప్రముఖులు, పర్యావరణ ప్రేమికులు కొనియాడుతున్నారు. వీరబాబు రూపొందించిన ‘జాతీయ వినాయకుడు’ కేవలం ఓ విగ్రహం కాదు.. రైతు కష్టం, దేశభక్తి, ప్రకృతి ప్రేమ, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను గుర్తుచేసే ఓ సందేశం అని ఆనందం వ్యక్తం చేశారు.

## అన్నవరం దేవస్థానం నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి సంబంధించిన నూతన బస్సులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. అనంతరం దేవస్థానంలో సత్యదేవుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో దేవస్థానానికి నూతన బస్సులను అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం,దేవస్థానం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు,రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,దేవస్థానం పాలకమండలి సభ్యులు పర్వత సురేష్,పాలచర్ల నాగేంద్ర చౌదరి,కామర్స్ చిరంజీవి, వెంకట రమణ,శంఖవరం మండల టిడిపి అధ్యక్షులు ఈగల దేవుళ్ళు,నాయకులు వీర్ల సూరిబాబు, బొమ్మిడి సత్తిబాబు,మడ్డు వీరబాబు,మెరపల నర్సయ్య,రాజాల చిట్టిబాబు,పసుపులేటి చక్రి, పలివెల సతీష్,బండారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంపై పోలీసుల అవగాహన

--నిమజ్జన వేళ భద్రత,ట్రాఫిక్ నియంత్రణపై సూచనలు

-- డీఎస్పీ ఏబీజీ తిలక్,సీఐలు వైఆర్‌కే శ్రీనివాస్,కృష్ణ భగవాన్



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**గణేష్ నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన జాగ్రత్తలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దాపురం సర్కిల్ పోలీసు కార్యాలయం వద్ద సమావేశం జరిగింది. పెద్దాపురం,సామర్లకోట మండలాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,పంచాయతీ అభివృద్ధి అధికారులు,రెవెన్యూ అధికారులు గ్రామ మహిళా పోలీసులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి డీఎస్పీ తిలక్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్,సామర్లకోట సీఐ ఆళ్ల కృష్ణ భగవాన్,ఎస్సైలు పాపారావు, నూకరాజు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కుడేరు మండలం మరియు మరుట్ల గ్రామపంచాయతీ ప్రజానీకానికి వినాయక చవితి శుభాకాంక్షలు

**సెప్టెంబర్ 13 ప్రజాజ్యోతి న్యూస్ :-** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర పీఏసీ మెంబర్ ఉరవకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి గారికి అలాగే ఉరవకొండ యువనేత వై ప్రణయ రెడ్డి గారికి నియోజకవర్గం ప్రజానీకానికి మరియు కుడేరు మండలం ప్రజానీకానికి అలాగే మరుట్ల గ్రామపంచాయతీ ప్రజానీకానికి అధికారులకు అనధికారులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కుటుంబ సభ్యులకు బంధుమిత్రులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు చిన్న కొండప్ప గారి శ్రీనివాస్ నాయుడు విఘ్నాలు తొలగించే ఆ వినాయకుని దీవెనలు ప్రజలందరి పైన ఎల్లవేళలా ఉండాలని తెలియజేశారు.




## పీజీఆర్ఎస్‌కు సోమవారం సెలవు

**వినాయక చవితి నేపథ్యంలో పోలీస్ శాఖ నిర్ణయం ఎస్పీ ఉమామహేశ్వర్**

**బాపట్ల, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని బాపట్ల జిల్లా పోలీస్ శాఖ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒకరోజు విరామం ప్రకటించింది. సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమం సెప్టెంబర్ 14న జరగదని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పండుగ రోజు కావడంతో ప్రజలు పోలీస్ కార్యాలయానికి వచ్చి ఇబ్బందులు పడకుండా ముందుగానే ఈ సమాచారాన్ని తెలియజేస్తున్నట్లు పోలీస్ శాఖ పేర్కొంది. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి ఫిర్యాదుల కోసం వచ్చే ప్రజలు సోమవారం తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని ఎస్పీ సూచించారు. వినాయక చవితి నేపథ్యంలో తీసుకున్న ఈ నిర్ణయం ఒక్కరోజుకే పరిమితం కాగా, అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమం సాధారణ షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని ఎస్పీ కోరారు.



## స్థానిక సంస్థల ఎన్నికలపై కౌతాళం టిడిపి కార్యకర్తల సమావేశం.



**కౌతాళం, సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి** మంత్రాలయం ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య మరియు మండల అధ్యక్షులు సురేష్ నాయుడు ఆదేశాల మేరకు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశ కార్యక్రమాన్ని నిర్వహించిన కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు. త్వరలో రాబోవు ఎంపీటీసీ, జడ్పిటిసి మరియు సర్పంచ్ ఎన్నికలపై కౌతాళం టిడిపి కార్యాలయంలో నాయకులకు మరియు కార్యకర్తలకు ఎన్నికల రిజర్వేషన్లపై మరియు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు అన్ని స్థానాలు కూటమి పార్టీలు కైవసం చేసుకోవాలని తెలిపారు.పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పకుండా పదవులు వస్తాయని ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లూరు వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్, మాజీ ఎంపిటిసి చౌదరి బసవ,టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజానందు, రైతు అధ్యక్షుడు గిరి, ముఖన్న,రమేష్, సుల్తాన్ సుభాన్, గొట్టయ్య,లింగేష్, నబి,అమ్ముమలి, రేవన్న,నాగరాజు పాల్గొన్నారు.

## రాజభక్ష ఫర్టిలైజర్ షాపుకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన మండల వ్యవసాయ అధికారి శేషాద్రి



**కౌతాళం, సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి** ఆదివారం రోజు పై అధికారుల ఆదేశాల మేరకు కౌతాళం మండలంలోని కౌతాళం గ్రామంలో రాజభక్ష సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాపు నందు మండల వ్యవసాయ అధికారి మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు రెగ్యులర్ ఆదోని వారు అకస్మికతనిఖీల్లో భాగంగా పైషాపు నందు విచారణ జరపడం జరిగింది.ఈ విచారణలో ఫర్టిలైజర్ సంబంధించి యూరియా మరియు ఎరువుల స్టాకుల నందు వ్యత్యాసం ఉండడం వల్ల షాపు యజమానికి షోకాజ్ నోటీసు ఇస్తూ.1,19,959/-రూపాయలు ఫర్టిలైజర్ అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగినది.తదుపరి సహాయ వ్యవసాయ సంచాలకుల ఆదోని వారు ఎరువులు డీలర్లకు ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు అమ్మిన యూరియాకు ఇతర ఎరువులను లింకులు అంటగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడినని హెచ్చరించినారు. మండల వ్యవసాయ అధికారి శేషాద్రి ఒక ప్రఖం ద్వారా తెలియజేశారు.

## తుని నియోజకవర్గం లో జిల్లా పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా తో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ,రాష్ట్ర అధికార ప్రతినిధి మురళిరాజు భేటీ




**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈరోజు తుని సాయి వేదిక ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రివర్యులు ,తుని నియోజవర్గం ఇంచార్జ్ దాడిశెట్టి రాజా అధ్యక్షతన ఏర్పాటుచేసిన విస్తృతస్థాయి సమన్య కమిటీ సమావేశాల్లో తుని నియోజ వర్గ స్థాయిలో వై.యస్.ఆర్.సి. పి ఐడీ కార్డ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యులు,రాజ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు జడ్పీటీసీలు,ఎంపీపీలు,ఎంపీటీసీలు,సర్పంచ్,స్టేట్ జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి ఎస్ఐ రామకృష్ణ



**తాళ్లపూడి, సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి న్యూస్** వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఎస్ఐ టి రామకృష్ణ సూచించారు. మండపాలకు అనుమతులు గణేష్ ఉత్సవ్.నెట్ లో ఆన్ లైన్ లోనే తీసుకోవాలని, సీసీ కెమెరాలు, లైటింగ్, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఉదయం 6 గం నుండి రాత్రి 10 గంటల వరకు పరిమితికి మించిన శబ్దంతో సౌండ్ బాక్సులు వాడాలని, డీజేలు నిషేధమని, మట్టి విగ్రహాలే వాడాలని స్పష్టం చేశారు.అనుమతి లేని ఫ్లెక్సీలు, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం, ఆయుధాలకు అనుమతి లేదని, ట్రాఫిక్ కు అంతరాయం కలిగించరాదని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కు లేదా 9490760794కు సమాచారం ఇవ్వాలని కోరారు

# జిల్లా నాయకుల సమక్షంలో వైసీపీలో జాయిన్ అయిన కురసాల సతీష్





**తాళ్లపూడి, సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి న్యూస్** వేగేశ్వరపురం గ్రామానికి చెందిన కురసాల సతీష్ నాయకులు అభిమానులు కార్యకర్తలు నడుమ వైసీపీ పార్టీలో జాయిన్ అయ్యారు. ఆదివారం వేగేశ్వరపురం కురసాల కన్వెన్షన్ లో ఈ చేరిక వేడుకగా మారింది ముందుగా వేగేశ్వరపురం వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి నాయకుల నడుమ యువకులు, మహిళలు తరలిరావడంతో సభ ప్రాంగణం అంతా కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ తలారి వెంకటరావు మాట్లాడుతూ యువకుడి రాకతో పార్టీలో పెను మార్పులు ఖాయమన్నారు. కురసాల సతీష్ లాంటి చదువుకున్న యువకుడు పార్టీలోకి రావడం వల్ల ఎన్నో మార్పులు వస్తాయని అన్నారు. సతీష్ చేరికతో యూత్ వింగ్ మరింత బలపడుతుందన్నారు. కొత్త ఆలోచనలు, కొత్త ఉత్సాహం పాత పద్ధతులకు స్వస్తి పలికి, సోషల్ మీడియా నుండి గ్రామ స్థాయి వరకు కొత్త టెక్నాలజీతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తారన్నారు. యువ నాయకుడి రాకతో సామాన్య ప్రజల్లో, ముఖ్యంగా యువతలో వైసీపీ పై నమ్మకం రెట్టింపు అవుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ కురసాల కుటుంబం అంటే జగన్ కుటుంబానికి సన్నిహిత కుటుంబం అని అన్నారు. సతీష్ రాక తలారి విజయానికి బాట అన్నారు. జి శ్రీనివాస్ నాయుడు, జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్నకు యువతే బలమన్నారు. వైసీపీలో ఉన్న జిల్లా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రెండున్నర సంవత్సరాల తర్వాత కూడా వైఎస్ఆర్సిపి లో జాయిన్ అవుతున్నారు, అంటే పార్టీ అంత బలంగా ఉందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమం అయితే మేలు జరుగుతుందనే నమ్మకంతో కొంతమంది యువకులు మన పార్టీలో చేరడం చాలా ఆనందకరమని అన్నారు. యువకుడు డైనమిక్ సతీష్ లాంటి యువకులు రావడం వల్ల వైసీపీ భవిష్యత్తు మరింత బంగారుమయం అవుతుందని అన్నారు. కొమ్మిరెడ్డి రామారావు, సతీష్ ని అభినందిస్తూ, ఈ యువకుడి రాకతో పార్టీలో కొత్త రక్తం వచ్చినట్లయిందన్నారు. జి ఎస్ రావు ఆశీస్సులతో పార్టీలో కొనసాగుతూ వచ్చామని అన్నారు. గ్రామం నుండి ఎవరైనా మా పార్టీలోకి రావచ్చని వారికి తగిన అవకాశం ఇప్పిస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కొవ్వూరులో వైసీపీ విజయం ఖాయం అని అన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తారనే రాష్ట్ర ప్రజలు బ్రతికి బట్ట కడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, నియోజక వర్గం పరిశీలకులు గొందేసి శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, మండలం కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, గ్రామ వైసిపి అధ్యక్షుడు దూసనపూడి భగవాన్,జిల్లా ఆక్టివిటీ సెక్రటరీ వంబోలు పోసి బాబు, కొవ్వూరు టౌన్ ప్రెసిడెంట్ చిట్టూరి అన్నవరం, దమయంతి, పెండెంపోసిబాబు, కనుమూరి వెంకటేష్ ,నియోజకవర్గ వైకాపా నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# సెస్ డేటాలోనిర్వాసితుల పేర్లు ఏలా మాయమయ్యాయి?..

**కటాఫ్ డేట్ తర్వాత వివాహం చేసుకున్న మహిళలకు నష్టపరిహారం చెల్లించాలి!..**

**వచ్చేపార్లమెంట్ సమావేశాల్లోనిర్వాసితుల పక్షాననిలబడి ప్రశ్నిస్తా!..**

**పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజా రాణి!..**

**మాజీ శాసనసభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మీ!..**







**వి.ఆర్.పురం,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి ప్రతినిధి)**సెస్ డేటాలో నిర్వాసితుల పేర్లు మాయమయ్యాయని, ఇది సరైన పద్ధతి కాదని, కటాఫ్ డేట్ తరువాత విహహం చేసుకున్న, మహిళలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం వరరామచంద్రాపురం, మండలంలో మొదటిసారిగా అరకు పార్లమెంట్ సభ్యులు గుమ్మ తనిజారాణి, పోలవరం ప్రాజెక్టు ప్రభావిత నిర్వాసితులైన గ్రామాలు చింతరేవుపల్లి రేఖపల్లి, బి.సి కాలనీ, వడ్డిగూడెం, రాజుపేట, తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు గుమ్మా తనిజారాణి, రంపచోడవరం మాజీ శాసన సభ్యులు నాగులపల్లి ధనలక్ష్మీ, మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఈప్రాంత పోలవరం నిర్వాసితులను వారిబాధలను సరిగ్గా పట్టించుకోవడం లేదని మెజారిటీ గ్రామప్రజలు కోరుకున్న చోట పునరావాసం చూపించే ప్రక్రియలో అలసత్వం వహిస్తున్నారని,ఇది పద్ధతిగా లేదని హెచ్చరించారు. నేటికీ ఇంటి నష్ట పరిహారం పూర్తిగా ఇవ్వలేదని, పరిహార విషయంలో బాధితులకుసరైన న్యాయం జరగటంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కట్ ఆఫ్ డేట్ తర్వాత వివాహం చేసుకున్న మహిళలకు నష్టపరిహారం విషయంలో అన్యాయం జరుగుతుందని, కాంటూరుతో సంబంధం లేకుండా ఈ ప్రాంతంలో మరికొన్ని గ్రామాలను బాధితుల జాబితాలో చేర్చాలని, సూచించారు.చెస్ డేటాలో నిర్వాసితులపేర్లు ఏలా మాయమయ్యాయని ఇదిసరైన పద్ధతికాదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ప్రభావిత, పోలవరం బాధితుల పట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అందులో ఎలాంటి తేడా ఉండదని స్పష్టం చేశారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ ప్రాంత పోలవరం నిర్వాసితుల సమస్యలు, బాధలతోపాటు రైతుల బాధలు, ఇబ్బందులను ప్రస్తావించి తగున్యాయంచేసే విధంగా ముందుకు వెళ్తానని నిర్వాసిత బాధితులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, సీనియర్ నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్టిఐ విభాగంజిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, పోలవరం జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, చిన్నమట్ట పల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మండలనాయకులు పెట్టా రామారావు,గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ముత్యాల మురళీకృష్ణ ఐ.టి.ఐ వింగ్ అధ్యక్షులు ముత్యాల గౌతం ప్రభాకర్,వైఎస్ మండల ప్రెసిడెంట్ వద్దాణపు రాజారావు, బంధం రాజు ,ఎస్టీసెల్ మండల అధ్యక్షులు కోటం జయరాజు, రేఖపల్లి ఎంపీటీసీ సభ్యులు బంధం విజయలక్ష్మి,యూత్ మండల ప్రెసిడెంట్ కడుపు బాలు,మండల జనరల్ సెక్రెటరీ మోడెం నరేష్, ఎస్.సి,సెల్ జిల్లా నాయకులు చీమల కాంతారావు,ఆర్.టి.ఐ, వింగ్ మండల్ అధ్యక్షులు ముత్యాల జయరాజు, రైతు విభాగం నాయకులు గూటాల ముత్యాలరావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాచర్ల రాజేంద్ర, రేపు బాలరాజు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, కాపారపు నాగు, ముంజుపు పోసి, సోడి చిరంజీవి, జొన్నాడ నాగేశ్వరరావు, బొడ్డు జ్ఞానేశ్వర్, గూటాల నవీన్, గుంపున పల్లి వీరస్వామి, గుజ్జ రాజేశ్వరి, గుంపునపల్లి చైతన్య, రాజుపేట శ్రీరామగిరి రేఖపల్లి వి.ఆర్ పురం వడ్డుగూడెం, కుందులూరు, ములకలపల్లి చిన్నమట్టపల్లి, రామవరం, జీడిగుప్ప గ్రామాల కార్యకర్తలు నిర్వాసితులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ ఆశయాలకు ఆకర్షితులై.. జనసేనలోకి

**ఎర్రగట్టు కాలువలో 30 కుటుంబాలు, 50 మంది చేరిక**

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

**జనసేన మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్**



**ఎటపాక, సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నాయకత్వంలో గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు జనసేన పార్టీలోకి పెద్ద ఎత్తున చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్ పేర్కొన్నారు. ఆదివారం ఎటపాక మండలం చోడవరం పంచాయతీ పరిధిలోని ఎర్రగట్టు కాలువ గ్రామంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు గోడేటి నాగరాజు ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలకు చెందిన 50 మంది స్వచ్ఛందంగా జనసేన పార్టీలో చేరారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్ నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు పవన్ కల్యాణ్ నాయకత్వం, జనసేన పార్టీ ఆశయాలపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను మండల అధ్యక్షుడి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో రోడ్డు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేక నిత్యం సుమారు నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల సమస్యలపై మారాసు గంగాధర్ స్పందిస్తూ.. ఎర్రగట్టు కాలువ గ్రామానికి పక్కా రహదారి నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్ సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, ఉపాధ్యక్షుడు మొల సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోడేటి నాగరాజు, గ్రామ పెద్దలు మడకం దేవా, గ్రామస్తులు మడకం జోగారావు, కోరం ముతేష్, కోరం దేవయ్య, నూప దేవా, ముచ్చకి జోగయ్య, ముచ్చికి ముఖేష్, కోరం చుక్కయ్య, పోడియం పోజ్జా, మడివి రాజు, మడకం చిన్న జాగా, సోడి కన్నయ్య, కోరం భద్రయ్య, కోవ్వెసీ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకపోతున్నారు.

చించినాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేసిన మంత్రి నిమ్మల.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 13.** కూటమి ప్రభుత్వ రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి గొడ్డలి పార్టీ నాయకులు ఓర్వలేక పోతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో శనివారం జరిపిన పర్యటనలో బాగంగా చించినాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో విశాఖపట్నం దేవి ఫిషరీస్ సమకూర్చిన సిఎస్ఆర్ నిధులతో విద్యార్థినీ, విద్యార్థులకు మంత్రి నిమ్మల. రామానాయుడు సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ అయిదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి ని పట్టించుకోకుండా ఇప్పుడు అభివృద్ధి కి అడ్డుపడుతున్న గొడ్డలి పార్టీ నాయకులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదన్నారు.ఎన్నికల పేరుతో గొడ్డలి పార్టీ నాయకులు మీ ఇంటికి వస్తే ఎందుకు అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకున్నారంటూ నిలదీయాలని మంత్రి నిమ్మల పిలుపునిచ్చారు.గత ఐదేళ్లు ధ్వంసం, విధ్వంసం తప్ప అభివృద్ధి, సంక్షేమం కనిపించలేదని పనిచేసే కూటమి ప్రభుత్వాన్ని పనిచేయని గొడ్డలి పార్టీ ప్రభుత్వాన్ని బేరీజు వేసుకొని ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. నియోజకవర్గం టీడీపీ సమన్వయ కమిటీ నాయకులు జనసేన నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## శిలాఫలకం పై ప్రోటోకాల్ రగడ అధికారుల తీరుపై మండిపడ్డ తిగిరిపల్లి గోపి




**తాళ్లపూడి, సెప్టెంబర్ 13,ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గం, తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో ఈ నెల 12వ తేదీన జరిగిన విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవ శిలాఫలకంపై ప్రోటోకాల్ ను పూర్తిగా ఉల్లంఘించారని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సెల్ అధ్యక్షుడు గోపి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దేవం గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన మలకపల్లి విశాల సహకార బ్యాంకు అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకట సుబ్బరాయ చౌదరి, నియోజకవర్గ పెద్దలు పెండ్యాల అచ్చిబాబు, కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్ వంటి కీలక నాయకుల పేర్లను శిలాఫలకంపై ప్రస్తావించకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని ఆయన మండిపడ్డారు.గ్రామ, నియోజకవర్గ ప్రథమ పౌరులను, ప్రజా ప్రతినిధులను, కీలక బాధ్యతల్లో ఉన్న పెద్దలను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం అవమానకరమని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అధికారుల ఏకపక్ష వైఖరిపై స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆవేదనతో రగిలిపోతున్నారని తెలిపారు.కావున ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనకు కారణమైన సంబంధిత అధికారులపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ తరపున పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు

## తాళ్లపూడి మండలంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పర్యటన - ప్రజా సమస్యలపై ఆరా



**తాళ్లపూడి, సెప్టెంబర్ 13, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పర్యటించారు.మండలంలోని తాడిపూడి, పోచవరం, తుపాకులగూడెం గ్రామాల్లో ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ తాడిపూడి గ్రామంలో ప్రధాన రహదారి లోతట్టుగా ఉండడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వర్షం పడితే నీరు నిలిచిపోయి దోమల బెడద పెరిగిందని తాగునీటి సమస్య పరిష్కారానికి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్నారు. పోచవరం – తాడిపూడి మధ్య ఎర్ర కాలువపై నూతన వంతెన నిర్మాణంలో జాప్యం జరుగుతుండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను సంబంధిత అధికారులు, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో బుట్టాయగూడెం – పట్టిసీమ – కొవ్వూరు గోదావరి గట్టుపై రెండు వరుసల జాతీయ రహదారి నిర్మాణంతో పోలవరం ప్రాజెక్టు పర్యాటక ప్రాంతం అభివృద్ధి, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల అభివృద్ధి వేగంగా జరుగుతుందని, అందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.రానున్న స్థానిక ఎన్నికలలో జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు మున్సిపాలిటీ, నిడదవోలు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలన్నింటికీ బీజేపీ కార్యకర్తలు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ఎక్కువ మంది బీజేపీ కార్యకర్తలు, నాయకులను ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పిక్కి నాగేంద్ర తెలిపారు.అనంతరం తాడిపూడి గ్రామంలో ఇటీవల మరణించిన బీజేపీ మండల కార్యదర్శి బత్తుల విష్ణు కుటుంబ సభ్యులను పిక్కి నాగేంద్ర పరామర్శించారు. వారి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుమలశెట్టి కృష్ణ, నామా రంగనాయకులు, కొండేపాటి సత్యనారాయణ, ఉండవల్లి శ్రీనివాస్, కసిరెడ్డి సన్యాసి నాయుడు, మల్లిపూడి రాజేష్, బట్టు రమేష్, నక్కా వెంకటేశ్వరరావు, ప్రగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# గొల్లప్రోలులో పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో మట్టి వినాయకుల పంపిణీ

### పర్యావరణ పరిరక్షణే లక్ష్యం.. 850 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

### ప్రజల్లో పెరుగుతున్న పర్యావరణ చైతన్యం.. జనసేన నాయకుడు మొగిలి రాజా నాయుడు





**గొల్లప్రోలు, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటి చెబుతూ.. డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో గొల్లప్రోలు లో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు స్వస్తి పలికి.. ప్రకృతికి, జలవనరులకు హాని కలగకుండా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.గొల్లప్రోలు స్థానిక శివాలయం సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను జనసేన పార్టీ ప్రముఖ నాయకుడు మొగిలి రాజా నాయుడు ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజలు కార్యక్రమానికి హాజరై మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు.ఈ సందర్భంగా మొగిలి రాజా నాయుడు మాట్లాడుతూ.. తమ ప్రియతమ నాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు, పర్యావరణ పరిరక్షణపై ఆయన చూపిస్తున్న స్ఫూర్తితో గత మూడేళ్లుగా గొల్లప్రోలులో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచడంతో పాటు వినాయక చవితి పండుగను ప్రకృతి హితంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, వాటికి వినియోగించే రసాయన రంగుల కారణంగా చెరువులు, కాలువలు, ఇతర జలవనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.

**గతేడాదితో పోలిస్తే పెరిగిన డిమాండ్**

గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన గణనీయంగా పెరిగిందని మొగిలి రాజా నాయుడు తెలిపారు. ముఖ్యంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. దీంతో ఈ ఏడాది మార్కెట్‌లో మట్టి విగ్రహాలకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని, అందుకు అనుగుణంగా విగ్రహాల కొరత కూడా ఏర్పడిందని వివరించారు.గత సంవత్సరం సుమారు 1,200 మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశామని గుర్తుచేశారు. అయితే ఈ ఏడాది మార్కెట్‌లో మట్టి విగ్రహాలకు భారీగా డిమాండ్ ఏర్పడటంతో వాటిని సేకరించడం కొంత కష్టతరంగా మారిందన్నారు. అయినప్పటికీ తీవ్ర ప్రయత్నాలు చేసి సుమారు 850 మట్టి వినాయక విగ్రహాలను సేకరించి భక్తులకు ఉచితంగా అందజేశామని తెలిపారు.వినాయక చవితి సందర్భంగా ప్రతి కుటుంబం మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మొగిలి రాజా నాయుడు పిలుపునిచ్చారు. పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో పాటు.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు కీర్తి వెంకటరమణ, కేశవరపు విష్ణు, వేల శంకర్, మొగిలి దుర్గ, కేశవరపు సుబ్బు, కొల్లి శివ, తాటిచర్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు విగ్రహాల పంపిణీలో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గొల్లప్రోలు మున్సిపాలిటీలో తుది పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల

### పరిశీలించుకోవాలని కమిషనర్ సూచన



**గొల్లప్రోలు, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలోని 23 వార్డులకు సంబంధించి వార్డుల వారీగా తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను ఆదివారం అధికారికంగా విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే ఎన్నికలను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజల పరిశీలనార్థం అందుబాటులో జాబితాలు ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ తుది జాబితాను ప్రజల పరిశీలన కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ ప్రకటన ప్రకారం జాబితాలను జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ,సబ్ కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయా0 గొల్లప్రోలు పురపాలక సంఘం లో పోలింగ్ స్టేషన్లో ప్రదర్శించారు. పురపాలక సంఘ పరిధిలోని ఓటర్లందరూ మున్సిపల్ కార్యాలయానికి లేదా తమకు సమీపంలోని పైన పేర్కొన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను ఒకసారి పరిశీలించుకోవాలని మున్సిపల్ కమిషనర్ తెలియ పరిచారు. ఓటింగ్ రోజున ఎలాంటి గందరగోళం లేకుండా, తమ ఓటు హక్కును సజావుగా వినియోగించుకోవడానికి ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుందని ఆమె సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని వార్డులలోనూ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పూర్తయిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

## పండుగలో పర్యావరణ స్ఫూర్తి మట్టి గణపతుల పంపిణీ



### కలెక్టర్ చేతుల మీదుగా భక్తులకు ప్రతిమలు..

### విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**బాపట్ల ఆగస్టు 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** వినాయక చవితి పండుగకు పర్యావరణ స్ఫూర్తిని జోడిస్తూ బాపట్లలో మట్టి గణపతుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. పర్యావరణానికి హాని కలిగించే ప్రతిమలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయకులను పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టణంలోని భావనారాయణస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. పర్యావరణహిత ప్రతిమల పంపిణీలో జిల్లా కలెక్టర్ భాగస్వామ్యం కావడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది.మట్టి వినాయకుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల నిమజ్జనం కారణంగా నీటి వనరులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున. ప్రకృతికి అనుకూలమైన మట్టి ప్రతిమలను వినియోగించే సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా విన్నకోట సురేష్ ప్రత్యేకంగా తయారు చేయించిన పెద్ద మట్టి వినాయక ప్రతిమను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. అనంతరం పట్టణ సీఐ రాంబాబు, తహసీల్దార్ షాలిమా చేతుల మీదుగా కూడా పలువురు భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు.భక్తి, సంప్రదాయాలతో పాటు ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా గుర్తుచేసేలా కార్యక్రమం సాగింది. మట్టి వినాయక ప్రతిమలను అందించడంపై పలువురు ప్రజలు విన్నకోట సురేష్‌ను అభినందించారు.కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ ప్రతినిధులు వంగపాటి శివయ్య, చేజర్ల సతీష్, గొర్ల ఆంజనేయులు, ఎనుముల సుధాకర్‌రెడ్డి, పులిగడ్డ శ్యాంప్రసాద్, జనసేన నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, అంజనేష్ తదితరులు పాల్గొన్నారు.

## టిప్పు సుల్తాన్ ఇతహదుల్ ముస్లిమీన్ కమిటీకి 25 మంది సభ్యుల రాజీనామా



**గుంతకల్లు సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న కార్యాలయంలో ఆదివారం టిప్పు సుల్తాన్ ఇతహదుల్ ముస్లిమీన్ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ అధ్యక్షులు మసూద్, జిల్లా అధ్యక్షులు షేక్ మౌలా ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం కాలంగా కమిటీలో జరుగుతున్న కార్యక్రమాలు, తీసుకుంటు న్న నిర్ణయాలు ఏకపక్షంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు 9 నెలల క్రితం నూతన కమిటీని ఏర్పాటు చేయాల ని కమిటీ సభ్యులందరూ నిర్ణయించి తీర్మానం చేసినప్పటికీ, ఇప్పటివరకు నూతన కమిటీ ఏర్పాటు చేయకపోవడం పట్ల సభ్యు లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యుల నిర్ణయాలను, తీర్మానాలను పక్కనపెట్టి కొంతమంది వ్యక్తుల మెప్పు కోసం నిర్ణయాలు తీసుకోవడం తమకు ఆమోదయోగ్యం కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో తామంతా ఏకతాటిపైకి వచ్చి, కమిటీ లో కొనసాగడం ఇష్టం లేక శనివారం 25 మంది సభ్యులు కమిటీకి రాజీనామా చేస్తున్నట్లు మీడియా సమావేశంలో ప్రకటించారు. అయితే, కమిటీకి రాజీనామా చేసినప్పటికీ తాము ఇప్పటివరకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మాత్రం కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అందరి అభిప్రాయా లను తీసుకుని నూతన కమిటీని ఏర్పాటు చేసుకొా ని, ప్రజలకు తమ సేవలను యథావిధిగా కొనసాగిస్తామ ని తెలిపారు. ఈ సమావేశంలో మరో గౌరవ అధ్యక్షులు డి. రంజాన్, జిల్లా ఉపాధ్యక్షుడు దాదా ఖనందర్, పట్టణ ఉపాధ్య క్షుడు బషీర్, ట్రెజరర్ దాదా పఠాన్, సహాయ కార్యదర్శి మైత్రి భాష, ఎండి బాబా, సలహాదారుడు ఎండి మాజీద్, మహబూబ్ బాషా, నిజామి, న్యాయశాఖ సలహాదారుడు ఎండి బాబా తాజుద్దీన్, కమిటీ సభ్యులు శర్మష్ వలి, ఆయాజ్, గౌస్, జె ఎస్ డబ్ల్యు దాదా కలందర్, అన్వర్ ఖాన్, పాన్ హఫీజ్, కాజా, అయూబ్, జాఫర్, దాదా తల్వార్, ఎండి షబ్బీర్, కొనకొండ్ల వలి, షేక్ దాదా, టైలర్ షబ్బీర్, షేక్ మస్తాన్వలి, ఎండి జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితుల సమస్యలు పార్లమెంటులో ప్రస్తావిస్తా

**ఆరకు ఎంపీ గుమ్మ తనూజారాణి**

**చింతూరు సెప్టెంబర్ 13 ప్రజాజ్యోతి** డివిజన్లోని నాలుగు మండలాల్లో పోలవరం నిర్వాసితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, రాబోయే శీతాకాలం సమావేశాల్లో వాటిని పార్లమెంటులో ప్రస్తావించి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి భరోసానిచ్చారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ నాగులపల్లి ధనలక్ష్మితో కలసి ఆమె చింతూరు మండలం కుమ్మూరులో పోలవరం నిర్వాసితుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే రెండ్రోజుల పాటు ఎటపాక, కూనవరం, వీఆరప్పురం, చింతూరు మండలాల్లో పర్యటించినట్లు తెలిపారు. భూములు, గృహాలు, ఆర్ఆండ్ఆర్. పరిహారం విషయంలో నిర్వాసితులకు తగిన రీతిలో న్యాయం జరగలేదని ఆమె పేర్కొన్నారు. కాంటూరు లెక్కల మాటున కూటమి ప్రభుత్వం ముంపు గ్రామాలను పట్టించు కోవడంలేదని, దీంతో వరదల సమయంలో గిరిజనులు అనేక కష్టాలు పడుతున్నారని ఆమె విమర్శించారు. 45.75 కాంటూరులో వున్న ఎన్నో గ్రామాలు చిన్నపాటి వరదలకే ముంపుకు గురవుతున్నాయని, వాటిని 41.25 కాంటూరులో కలపాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నా కూటమి ప్రభుత్వంలో చలనంలేదని ఆమె విమర్శించారు. 18 ఏళ్లు నిండిన చాలామందిని పరిహారం జాబితాలో చేర్చలేదని దీనివలన అనేకమంది యువతకు అన్యాయం జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు. కటాఫ్ తేదీతో సంబంధంలేకుండా గ్రామాలు ఖాళీచేసే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ





ఆర్ఎండ్ఆర్ పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసారు. నిర్వాసితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీనిచ్చారు మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ 2022లో వచ్చిన వరదలకు ఈ ప్రాంత వాసులు పడిన కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రాధాన్యతా క్రమంలో 32 గ్రామాలను ముంపులో చేర్చడం జరిగిందని. ప్రస్తుతం వారందరికీ పరిహారం అందుతుంటే కూటమి నాయకులు దానిని తమ గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శిచారు. కేంద్రంలో వేరేపార్టీ అధికారంలో వున్నా వైఎస్ జగన్ తన ప్రభావంతో 32 గ్రామాలను ముంపులో చేర్చడం జరిగిందని, ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలోనే వున్న గడిచిన రెండున్నరేళ్లలో ఒక్క గ్రామాన్ని కూడా ముంపులో చేర్చలేకపోయారని ఆమె ఎద్దేవా చేసారు. నిర్వాసితులు కోరుకున్నచోట పునరావాసం కల్పించకుండా, అర్హులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. కొందరు పోలవరం అధికారులు పరిహారం విషయంలో అర్హులకు అన్యాయం చేస్తూ అనర్హులకు పరిహారం ఇస్తున్నట్లు తెలిసిందని, మా పార్టీ అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని ధనలక్ష్మి హెచ్చరించారు. కూటమి నాయకుల కల్లబొల్లి మాటలను వైఎస్సార్సీపీ శ్రేణులు ఎవరూ నమ్మవద్దని, గడచిన రెండున్నరేళ్ల కాలంలో వారు ప్రజలకు చేసిందేమీ లేదని ఆమె విమర్శించారు. విలువిద్యలో బంగారు పతకం సాధించిన స్థానిక కుమ్మూరు యువకుడు అణిగి దుర్గయ్యకు అర్హత వున్నా డీఎస్సీలో టీచర్ పోస్టు రాలేదని, అనర్హులకు మాత్రం కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో వుద్యోగాలు కట్టబెట్టిందని ఆమె ఆరోపించారు. అనంతరం వివిధ గ్రామాల నుండి వచ్చిన పోలవరం నిర్వాసితుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిచ్చడి మురళి. ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, లో ఆప్షన్ మెంబర్ ఎండీ జిక్రియా, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, కురసం నాగేశ్వరరావు, రాంప్రసాద్, మురళి. మాజీ సర్పంచ్లు ముచ్చిక నాగార్జున, కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణానికి మేలు







**– ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు**

**రణస్థలం , ప్రజాజ్యోతి న్యూస్:** మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రణస్థలం మండలంలో భారీ సంఖ్యలో వినాయకుని మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఎచ్చర్ల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ లంక శ్యామలరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిన్నింటి వెంకట భానోజీనాయుడు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకో వచ్చని తెలిపారు. ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత పద్ధతులను పాటిస్తూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాలుగు మండలాల అధ్యక్షులు ముప్పిడి సురేష్ కుమారాపు రవి బెందు మల్లేష్ టీడీపీ సీనియర్ నాయకులు చౌదరి బాబ్జి పిషిణి జగన్నాధంనాయుడు మండపాక కనకరావు, దుమ్ము అశోక్ ఎంపీటీసీ మజ్జి వెంకటరమణ కెల్ల హేమంత్ మండల కూటమి నాయకులు ప్రజలు,మహిళలు, భక్తులు,యువత పాల్గొన్నారు.

## మట్టి విగ్రహం పంచభూతాలకు ప్రతీక.జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులు పంపిణీ



**కర్నూలు సెప్టెంబర్ 13 ( ప్రజా జ్యోతి న్యూస్ )** స్టాఫ్ రిపోర్టర్ నగరంలోమట్టితో తయారుచేసిన వినాయకుని పూజించడం మన సాంప్రదాయం. ఆధ్యాత్మిక శాస్త్రీయ పర్యావరణ కారణాలు తెలిపేది. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వెనక ఆధ్యాత్మిక శాస్త్రీయ పర్యావరణ కారణాలు ఉన్నాయని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. డిసిసి అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు గారి సూచన మేరకు ఆదివారం కర్నూలు నగరంలోనీ 48 వ వార్డు రోజా వీధిలో కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ భూమి నీరు అగ్ని వాయు ఆకాశం వంటి పంచభూతాలకు ప్రతీక అని అందుకే మట్టి గణపతిని పూజించడం ద్వారా మనము ప్రకృతిని విశ్వాసాన్ని పూజించినట్లు అవుతుందన్నారు. మట్టిలో పుట్టి మట్టిలోనే లీనమవడం అనే సృష్టి తత్వాన్ని వినాయక నిమజ్జనం తెలియజేస్తుందన్నారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగవని అనేక రోజులు అలాగే ఉండడం వల్ల నీటిని కలుషితం చేయడం వల్ల పర్యావరణాన్ని దెబ్బ తీస్తాయని,మట్టి విగ్రహాలు నీటిలో వేయగానే సహజంగా త్వరగా కరిగిపోతాయని చెప్పారు. రసాయన రంగులు వాడటం వల్ల నీటిలో చేపలతో పాటు ఇతర జలచరాల ప్రాణాలకు హాని కలిగిస్తాయని, మారుమూల ప్రాంతాలలో చెరువులలో మట్టి పూడిక తీయడం వల్ల నీటి నిలువ సామర్థ్యం పెరగవచ్చు మీసాల సుమలత తెలిపారు.ఈ కార్యక్రమంలో పూజారి చంద్రశేఖర్ శర్మ, వెంకటేష్, విశ్వదిరాం,నాగప్ప, నారాయణమ్మ బీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్యాపిలి మండలంలో జోరుగా వినాయక విగ్రహాల విక్రయాలు



**ప్యాపిలి, సెప్టెంబర్ 13 ( ప్రజాజ్యోతి న్యూస్):** మండలవ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. గ్రామ గ్రామాన వినాయక మండపాలు ముస్తాబవుతుండగా, వినాయక విగ్రహాల కొనుగోళ్లతో ప్రధాన కూడళ్లు కళకళలాడుతున్నాయి. ప్యాపిలి, వివిధ ఆకృతులు, రంగుల్లో తయారైన వినాయక విగ్రహాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి.ఇప్పటికే పలువురు యువత మండపాలను సిద్ధం చేసుకుని, ముందుగానే విగ్రహాలను కొనుగోలు చేసి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై భక్తిగీతాలు, భజనల మధ్య మండపాలకు తరలిస్తూ యువత సందడి చేస్తున్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం పెరగడంతో ఈ ఏడాది మట్టి, ఇతర పర్యావరణహిత పదార్థాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలకు భక్తులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. రసాయనాలతో కూడిన పీఓపీ విగ్రహాల వల్ల నీటి వనరులకు కలిగే కాలుష్యాన్ని నివారించేందుకు ఎకో-ఫ్రెండ్లీ విగ్రహాలనే కొనుగోలు చేయాలని పలువురు యువత, భక్తులు నిర్ణయించుకుంటున్నారు.వివిధ పరిమాణాలు, ఆకృతుల్లో విగ్రహాలు లభిస్తుండటంతో మండప నిర్వాహకులు తమకు అనుకూలమైన విగ్రహాలను ఎంపిక చేసుకుంటున్నారు. మరోవైపు మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణ, పందిళ్ల ఏర్పాటు, మైక్ సెట్లు తదితర ఏర్పాట్లను నిర్వాహకులు వేగవంతం చేస్తున్నారు.వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే వినాయక నామస్మరణ, భక్తిగీతాలతో పండుగ సందడి నెలకొనడంతో ప్యాపిలి మండలం మొత్తం వినాయక చవితి ఉత్సవాల కోసం ముస్తాబవుతోంది.

## పట్టా భూమిలోకి వెళ్లకుండా నిర్బంధిస్తున్నారు.. పరిహారం ఇవ్వకుండానే టవర్ల నిర్మాణం

"రైతు తన హక్కులు కోల్పోవాల్సిందేనా?"

**--- డాక్టర్ కోనంకి శ్రీధర్ చౌదరి ఆవేదన**



**సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** తమ పట్టా భూమికి సంబంధించిన విషయంలో అన్యాయం జరుగుతోందని రైతు డాక్టర్, పది రూపాయల డాక్టర్ కోనంకి శ్రీధర్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా తమ పట్టా భూమి గేటు తాళాలు ప్రైవేట్ కంపెనీ ప్రతినిధుల వద్దే ఉన్నాయని, భూమి యజమానులైన తమకు తాళాలు ఇవ్వకుండా లోపలికి వెళ్లకుండా బయటే నిర్బంధిస్తున్నారని ఆరోపించారు.గతంలో ఫెన్సింగ్ను తొలగించి, గేట్లను ధ్వంసం చేసి తమకు సమాచారం లేకుండానే భూమిలో టవర్ల నిర్మాణం చేపడుతున్నారని శ్రీధర్ చౌదరి పేర్కొన్నారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తమకు అందాల్సిన పరిహారం ఇప్పటివరకు చెల్లించలేదని, ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు తెలిపారు.ఈ విషయంలో సంబంధిత అధికారులు రైతుల సమస్యను పట్టించుకోకుండా కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం న్యాయం కోరుతున్న రైతుకు తన సొంత భూమిలోకి వెళ్లే హక్కు లేకపోవడం ఎంతవరకు న్యాయం" అని ప్రశ్నించారు.రైతుల హక్కులు, భవిష్యత్తును కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ, ఈ విషయంపై సమాజం ఆలోచించాలని డాక్టర్ కోనంకి శ్రీధర్ చౌదరి విజ్ఞప్తి చేశారు.

## గొల్లప్రోలులో విద్యార్థులకు 'గాంధీ జయంతి' క్విజ్ పోటీలు: మున్సిపల్ కమిషనర్ దివిజా సంపతి



**గొల్లప్రోలు, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గొల్లప్రోలు మున్సిపాలిటీ మండల పరిధిలోని హైస్కూల్ విద్యార్థులకు ఈ నెల 14వ తేదీన మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివిజా సంపతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని, పోటీ తత్వాన్ని పెంచడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పోటీలకు సంబంధించిన పాఠశాలలు మండల పరిధిలోని 15 హైస్కూళ్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి.ప్రతి పాఠశాల నుండి ఎంపిక చేసిన విద్యార్థులతో కలిపి మొత్తం 75 మంది ఈ క్విజ్ బరిలో నిలవనున్నారు. 8, 9, 10 తరగతులకు చెందిన సోషల్ స్టడీస్ లోని జాగ్రఫీ హిస్టరీ పాలిటీ ఎకనామిక్స్ అంశాలతో పాటు జనరల్ స్టడీస్ పై ప్రశ్నలు ఉంటాయి. అలాగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలకు అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకల సందర్భంగా ఘనంగా బహుమతులు అందజే యడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు విద్యార్థులను ప్రోత్సహించి పోటీలను విజయవంతం చేయాలని కమిషనర్ దివిజా సంపతి తెలిపారు.ద

## జనసేన పార్టీ మొదలు నుంచి ఎన్ని ఆఫర్స్ వచ్చినా , ఎన్ని ప్రలోభాలు పెట్టినా జనసేన పార్టీని విడిచిపెట్టని నేత అలాగే ఇప్పటి వరకు అలుపెరగని జనసైనికుడు మన మణుగుల వెంకటేష్

**పిఠాపురం మున్సిపల్ చైర్మన్ పదవి రేసులో జనసేన నేత మణుగుల వెంకటేష్?**

**సామాజిక సమీకరణాలపైనే జనసేన అధిష్ఠానం మొగ్గు!**

**రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ.**



**పిఠాపురం (ప్రజా జ్యోతి)** పిఠాపురం మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయింపుపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కూటమి పొత్తుల సమీకరణాలు, సామాజిక వర్గాల బ్యాలెన్సింగ్ సమీక్షల నేపథ్యంలో జనసేన పార్టీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా కీలక నాయకులు మణుగుల వెంకటేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది... కూటమి పొత్తులో భాగంగా ఇప్పటికే పిఠాపురం అసెంబ్లీ స్థానంతో పాటు నియోజక వర్గాల పరిధిలో కాపు సామాజికవర్గానికి కీలక పదవులు ఏమి వరించలేదనే చెప్పకనే చెప్పాలి.పలు నామినేటెడ్ పదవుల్లోనూ అదే సమీకరణాలు కనిపించాయి. ఈ నేపథ్యంలో, జిల్లాలో అత్యంత కీలకమైన కాపు సామాజికవర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే యోచనలో జనసేన అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే జనసేన పార్టీలో సుదీర్ఘ కాలంగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మణుగుల వెంకటేష్ పేరును చైర్మన్ పదవికి పరిశీలిస్తున్నట్లు ఊహాగానాలు జోరందుకున్నాయి...

**పార్టీ నమ్మకస్తుడిగా గుర్తింపు :**

జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి మణుగుల వెంకటేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. కాపు సామాజికవర్గంలో బలమైన నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆయన పిఠాపురం టౌన్ జనసేన సీనియర్ నాయకులుగా ప్రజలలో మమైకమవుతూ గుర్తింపు పొంది ఉన్నారు. అదేవిధంగా, జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పార్టీ పట్ల అతనికున్న నిబద్ధత, సామాజిక సమీకరణాలు కలిసి వస్తే పిఠాపురం మున్సిపల్ చైర్మన్ పీఠం ఆయనకే దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నేతలు విశ్లేషిస్తున్నారు...

**అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ! :**

పిఠాపురం మున్సిపల్లో ఈ చర్చ హాట్టాపిక్గా మారినప్పటికీ,చైర్మన్ పదవి కేటాయింపుపై కూటమి లేదా జనసేన అధిష్ఠానం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న మణుగుల వెంకటేష్ పేరు కేవలం రాజకీయ వర్గాల ఊహాగానాలకే పరిమితమా? లేక అధిష్ఠానం ఇప్పటికే ఆయన వైపే మొగ్గు చూపిందా? అనే ఉత్కంఠకు తెరపడాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు...

# బేతంచర్లలో 56 పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల
## నగర పంచాయతీ కమిషనర్ డి. హరి ప్రసాద్



**బేతంచర్ల:సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలోని 28 వార్డులకు సంబంధించి మొత్తం 56 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ఆదివారం విడుదల చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ డి. హరి ప్రసాద్ ఆధ్వర్యంలో తుది జాబితాను ప్రకటించారు.ఈ కార్యక్రమంలో టి.పి.ఓ శబరీష్, మేనేజర్ అబిదా బేగం, సీనియర్ అసిస్టెంట్ జిలానీ భాషతో పాటు నగర పంచాయతీ ఎన్నికల బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.28 వార్డులకు సంబంధించి 56 పోలింగ్ స్టేషన్ల వివరాలను అనెక్సర్--1లో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రజల పరిశీలనార్థం నగర పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులో కూడా ప్రచురించి నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ డి. హరి ప్రసాద్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలోని 28 వార్డుల కు మొత్తం 56 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల పరిశీలనార్థం నగర పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రచురించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు.

# జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు వినాయక చవితి శుభాకాంక్షలు

**కర్నూలు సెప్టెంబర్ 13 ( ప్రజా జ్యోతి న్యూస్ ) స్టాఫ్ రిపోర్టర్** కర్నూలు జిల్లా ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు.. షేర్ చేయవద్దు.రేపు (సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం) వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బంది మీడియా మిత్రులకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలందరూ సోదరభావం మత సామరస్యంతో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని వినాయక మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు,నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలుతీసుకోవాలని,విగ్రహాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని,రాత్రి వేళల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నిబంధనల మేరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని,అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు,మత పెద్దలు,యువత, ప్రజాప్రతినిధు లు,మీడియా మరియు అన్ని వర్గాల వారు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియా,వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అసత్య ప్రచారాలు,వదంతులను ప్రజలు నమ్మవద్దని,వాటిని ఇతరులకు షేర్ చేయకుండా నిజానిజాలను నిర్ధారించుకునేం దుకు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసులకు, డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.



## త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ప్యాపిలి కమిటీ ఆధ్వర్యంన ప్యాపిలి గ్రామం లో శ్రీ కృష్ణ భగవానుడి ప్రతిమ ఊరు ఎరిగింపు కార్యక్రమం దిగ్విజయం, నేటితో కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి

### కృష్ణం వందే జగద్గురుమ్

**(ప్రజాజ్యోతి న్యూస్) సెప్టెంబర్ 13**"త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ప్యాపిలి కమిటీ" ఆధ్వర్యంన శ్రీ కృష్ణుడి ప్రతిమ ను శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజు సెప్టెంబర్ 4 న శుక్రవారం నాడు నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం టౌన్ అయ్యప గుడి దగ్గర వేదిక నిర్మించి , కొలువు తీర్చి, స్వామికి ప్రతి రోజు ఉదయం సాయంత్రం జ్ఞాన రీత్యా నిత్య పూజలు , భగవద్గీత శ్లోక పారాయణం చేసి 10 వ రోజు సెప్టెంబర్ 13న ఈ రోజు అనగా ఆదివారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం కృష్ణ వేదిక కృష్ణుని వేదిక ప్రాంతం అయ్యప్ప స్వామి టెంపుల్ పక్క నుండి బయలుదేరి మెయిన్ రోడ్డు బస్టాండ్ వీధి నుంచి చిల్ల కట్టమీదగా వెళ్లి క్రింది వీధి కి పోయి అక్కడి నుండి తిరిగి మరలా,కృష్ణ ప్రతిమ కొలువు వద్దకి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పుర వీధులలో అంగరంగ వైభవంగా జరిగింది .నేటి ఊరేగింపు తో కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి...ముఖ్య అతిథిలుగా ప్యాపీలియు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ మురళి కృష్ణ గారు , నల్ల మేకలపల్లి టిడిపి సత్యం లు పాల్గొని స్వామికి కాయ కర్పూరం సమర్పించి, పూజ చేసి పల్లకీ మోశారు.. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి-ఇందూ జ్ఞాన వేదిక ప్యాపిలి కమిటీ అధ్యక్షులు, సభ్యులు బి.కేశవులు గారు, రమణ, జి.రాఘవ, మధు, చంద్ర, సురేష్, గోపాల్ , జిల్లా నుండి పలు ప్రబోధ సేవా సమితి సభ్యులు గుత్తి , డోన్, హుసేనపురం, జలదుర్గం, ఏనుగుమరి, మెట్టుపల్లి, కర్నూలు కోటకొండ, నరసాపురం, తుగ్గలి ప్రాంతాల నుంచి త్రైత సిద్ధాంత సభ్యులు పాల్గొన్నారు.



ఊరేగింపు, జన్మాష్టమి ఉద్దేశ్యం:- దేవుడే మనిషిగా అవత రించి మనిషి.గా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటాము... అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు ఆయనను మాత్రమే అందరూ దైవం గా గుర్తించాలి అని., కృష్ణుడు పౌర్ణమి అమావాస్యలకి మధ్య అష్టమి తిథిలో పుట్టి జ్ఞాన అజ్ఞానములకు వారధి గా ఉన్నాడనీ, ఊరి లోని వారందరికీ ఎరుక పరచుటకు ఈ ఊరు ఎరిగింపు (ఊరేగింపు) కార్యక్రమం చేస్తున్నాము అని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు.

## పోలీస్? కస్టడీకి ఆర్మీ ఆయుధాల చోరీ కేసు నిందితుడు
# పూర్తి నెట్‌వర్క్‌పై ఆరా తీయనున్న పోలీసులు

సికింద్రాబాద్ బొల్లారం కంటోన్మెంట్‌లోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆర్మీ ఆయుధాల చోరీ కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం వెలుగుచూసిన వెంటనే అప్రమత్తమైన ఆర్మీ, పోలీసులు, నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. ఎట్టకేలకు చోరీకి గురైన 10 రోజుల అనంతరం ఆయుధాలను ఇటీవల స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని కూడా అరెస్ట్ చేశారు. ఈ కేసును మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

**15వ తేదీ నుంచి పోలీస్ కస్టడీ**

ఇందులో భాగంగా ఆయుధాల కేసు ప్రధాన సూత్రధారిగా ఉన్న నిందితుడు మల్లేశ్?ను సికింద్రాబాద్? కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నిందితుడికి 7 రోజులపాటు పోలీస్? కస్టడీకి అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాలతో ఈనెల 15వ తేదీ నుంచి వారం రోజులపాటు నిందితుడిని పోలీసులు విచారించనున్నారు.

**అసలు కుట్రదారులెవరు :**

పటిష్ఠ భద్రత ఉన్న ప్రాంతం నుంచి ఏకంగా ఆర్మీ ఆయుధాలనే చోరీ చేయడంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేయనున్నారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు కుట్రదారులు ఎవరు? దీని వెనుక ఉన్న ముఠా నెట్?వర్క్? ఏంటి? ఆయుధాలను ఎవరికి ఇవ్వాలనుకున్నారు? వంటి వివరాలను రాబట్టనున్నారు. కేవలం ఒకే కోణంలో కాకుండా, కేసులోని అనుమానితులనూ నిందితుడు మల్లేశ్‌తో ముఖాముఖి కూర్చోబెట్టి ఉమ్మడిగా విచారించాలని పోలీసులు ప్లాన్ చేస్తున్నారు. నిందితుల వాంగ్మూలాల్లోని తేడాలను బట్టబయలు చేస్తూ అసలు నిజాలను తెలుసుకొనేందుకు పక్కా ప్రణాళికతో వ్యవహరించనున్నారు.



**లోపలి వ్యక్తుల హస్తం ఉందా?**

అత్యంత భద్రత కలిగిన ప్రాంతం నుంచి ఆర్మీ ఆయుధాలను బయటకు తీసుకురావడం వెనుక లోపలి వ్యక్తుల హస్తం ఉందా? చోరీ వెనుక మొత్తం ఎంతమంది ఉన్నారనే వివరాలను పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా నిగ్గు తేల్చనున్నారు. నిందితుడు మల్లేశ్? నుంచి లభించే ఆధారాల ఆధారంగా లోతైన దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ మొత్తం దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అన్ని వివరాలను ఎన్?ఐఏ సహా ఇతర దర్యాప్తు సంస్థలకు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే పోలీస్? కస్టడీలో భాగంగా మరిన్ని కీలక వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం
**- జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్**



**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టివినాయకుడి విగ్రహాలనే పూజించాలని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అన్నారు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నాడు కాకినాడ ఆదిత్య కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, మన సంప్రదాయాలను కాపాడుకోవాలి అన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి వినాయకులను పూజించాలని ఆయన సూచించారు.వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టడం మంచిదని కొనియాడారు . ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి వినాయకులను స్వీకరించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, జనసేన జిల్లా నాయకులు గొర్లె జగన్నాధం, రౌతు నారాయణరావు కార్యకర్తలు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## -పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుల పంపిణీ

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** పామిడి పట్టణంలో గల వాసవి కళ్యాణ మండపం (అమ్మవారిశాల)నందు "వినాయకుడిని పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో పామిడిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. భారతీయ జనతా పార్టీ. బిజెపి. ఆల్ సెల్స్ కన్వీనర్ కనంపల్లి చిరంజీవి రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్.ఎస్.ఎస్. సారధ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.





ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రసాయన రంగులతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పి.ఓ.పి విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకుంటూ, మన సాంప్రదాయాల ప్రకారం వినాయక చవితి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత మట్టి వినాయకుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. భక్తులందరూ మట్టి గణపతులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని వారు పిలుపునిచ్చారు.ప్రొద్దుటూరు వారి శ్రీధర్ జువెలర్స్ ఆధ్వర్యంలో లోకమాన్య బలగంగాధర్ తిలక్, ఛత్రపతి శివాజీ, గణేశుని చిత్రాలు కలిగినటువంటి 30 ఫ్లెక్సీ లను అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు పట్రా శ్రీనివాసులు, నగరూరు విశ్వనాథ్, పుల్ల చౌడయ్య, పి.నల్లప్ప, జోజోడే కుమార్, అంగజాల మంజు ప్రొద్దుటూరు వారి శ్రీధర్ జ్యువేలర్స్, బిజెపి నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి విగ్రహాలను ఉత్సాహంగా తీసుకెళ్లారు.

## శ్రీ భాస్కరా విద్యానికేతన్ ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాలు ఉచిత పంపిణీపాల్గొన్న డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌సిఐ గోపాల కృష్ణ





**చింతూరు సెప్టెంబర్ 13 ప్రజాజ్యోతి** పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చింతూరు డిఎఫ్ ఓ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఆదివారం చింతూరులో శ్రీ భాస్కర విద్యానికేతన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డిఎఫ్ఓ పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల పర్యావరణానికి చాలా ముప్పు ఉందని మట్టి గణపతి విగ్రహాలనే వినాయక చవితి పండుగకు ప్రతి ఒక్కరు వినియోగించాలని కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ మట్టితో తయారుచేసిన గణపతి ప్రతిమలు వల్ల ఎటువంటి నష్టం ఉండదని, విద్యార్థులకు చిన్నప్పటి నుండే పర్యావరణం మీద అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ఎస్సై సంతోష్ కుమార్ మాట్లాడుతూ పండుగలు శాంతియుతంగా సాంప్రదాయంగా జరుపుకోవాలని అన్నారు. శ్రీ భాస్కర విద్యానికేతన్ కరస్పాండెంట్ చిరసాని వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎకడమిక్ కోఆర్డినేటర్ త్రివీణ, ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు రమేష్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



# యూత్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ప్రణమ్ దేవరాజ్ 'శ్రీరస్తు'.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు షురూ!

నటుడు ప్రణమ్ దేవరాజ్ కథానాయకుడిగా, టాలెంటెడ్ బ్యూటీ సంజనా ఆనంద్ హీరోయిన్‌గా నటిస్తోన్న తాజా చిత్రం 'శ్రీరస్తు'. హరి క్రియేషన్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా శంకర్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పెండ్లిమడుగు హరి కృష్ణ గౌడ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో ద్విభాషా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కుటుంబ విలువలకు పెద్దపీట వేస్తూనే, సరికొత్త యూత్ ఫుల్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. ముఖ్యంగా హీరో హీరోయిన్ల మధ్య సాగే క్యూట్ లవ్ స్టోరీ, వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకే ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను, ముఖ్యంగా యువతను ఈ సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో మరో ప్రత్యేక ఆకర్షణగా కన్నడ స్టార్ హీరో ప్రజ్వల్ దేవరాజ్ కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. వీరితో పాటు సుమన్, దేవి ప్రసాద్, ఆమని, చైత్ర రాయ్, ప్రసాద్ బెహ్రా, రవి ప్రకాష్, రవి శివ తేజ వంటి అనుభవజ్ఞులైన ప్రముఖ నటీనటులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర అద్భుతమైన బాణీలు సమకూరుస్తున్నారు. బాల సరస్వతి సినిమాటోగ్రఫీ, శ్రీ వర్కల ఎడిటింగ్, కృష్ణ మాయ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు సినిమా స్థాయిని మరింత పెంచుతున్నాయి. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ అల్లరితో కూడిన కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.

# ధ్రువ్ విక్రమ్ కొత్త సినిమా 'జాకీ'.. అదరగొట్టే ఫస్ట్ లుక్‌తో ఎంట్రీ!

ప్రముఖ నటుడు చియాన్ విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాబోతోంది. టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థగా కొనసాగుతున్న మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'జాకీ' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, చిత్ర బృందం అధికారికంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ధ్రువ్ విక్రమ్ సరికొత్త హెయిర్‌స్టైల్‌తో, స్టైలిష్ బ్రౌన్ దుస్తుల్లో ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నాడు. దూకుడైన హావభావాలతో, ముందుకు చాచిన పిడికిలితో ఉన్న అతని లుక్ ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌ను గమనిస్తే, వాస్తవికతకు దగ్గరగా ఉండే గ్రిట్టీ యాక్షన్‌కు కామిక్ బుక్ తరహా స్టైల్‌ను జోడించినట్టు తెలుస్తోంది. పోస్టర్‌పై "నో రీటేక్స్ అలౌడ్" అనే ట్యాగ్‌లైన్ ఇవ్వడం సినిమా కాన్సెప్ట్‌పై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాలీవుడ్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్, తమిళ చిత్ర పరిశ్రమలో నిర్మిస్తున్న నాలుగో ప్రాజెక్ట్ ఇది. ఈ చిత్రానికి కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, విలక్షణ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఫస్ట్ లుక్‌ను బట్టి చూస్తే, 'జాకీ' ఒక స్టైలిష్, మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను అలరించనుందని స్పష్టమవుతోంది. ఈ ప్రకటనతో ధ్రువ్ విక్రమ్ అభిమానులు, సినీ ప్రియులలో ఉత్సాహం నెలకొంది.







# ఏడుగురు మహిళల విభిన్న ప్రయాణం.. ఆకట్టుకుంటున్న 'హ్యాపీ జర్నీ' ట్రైలర్!

భిన్నమైన మనస్తత్వాలు కలిగిన కొంతమంది మహిళలు ఒకే ట్రిప్‌కు వెళ్తే ఎలాంటి సరదా సంఘటనలు, ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయనే విభిన్న కథాంశంతో వస్తున్న తాజా చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలయ్యి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. టాలీవుడ్ సీనియర్ నటి అన్నపూర్ణ, ఆమని, ప్రముఖ యాంకర్ ఝాన్సీలతో పాటు వంశీ, పాయల్ రాధాకృష్ణ, సునయన, రవి శివతేజ, జినీష అలిశెట్టి, రూప శ్రీనివాస్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వివిధ తరాలకు చెందిన ఏడుగురు మహిళలు యూరప్ ట్రిప్ నేపథ్యంలో సాగే ప్రయాణమే ఈ సినిమా ప్రధాన కథాంశం. మొదట్లో భిన్నమైన అభిప్రాయాల కారణంగా వారి మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు, సరదా సంభాషణలు, ఆ తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ప్రయాణాన్ని ఎలా సాగించారనే భావోద్వేగపూరిత అంశాలతో ట్రైలర్‌ను చాలా ఆసక్తికరంగా కట్ చేశారు. అభీరామ్ నాయుడు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గుట్ట ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిలిం కార్పొరేషన్ పతాకాలపై గుట్ట బాలాజీ, గుండాల కౌశిక్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర బాణీలు అందిస్తుండగా, మణికంఠ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. మంచి వినోదం, సెంటిమెంట్ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన ఈ 'హ్యాపీ జర్నీ' చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'ఇరుముడి' సక్సెస్: రవితేజను స్వయంగా అభినందించిన చిరంజీవి, రామ్ చరణ్



మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా కలిసి అభినందించారు. రవితేజ, దర్శకుడు శివ నిర్వాణతో పాటు ఇతర యూనిట్ సభ్యులతో వారు సమావేశమై సినిమా విజయం పట్ల తమ సంతోషాన్ని పంచుకున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో చిరంజీవి, రామ్ చరణ్ స్వయంగా చిత్ర యూనిట్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వాస్తవానికి, సినిమా విడుదలైనప్పుడే చిరంజీవి సోషల్ మీడియా వేదికగా 'ఇరుముడి' బృందాన్ని ప్రశంసించిన విషయం తెలిసిందే. ఇప్పుడు నేరుగా కలవడం ఇండస్ట్రీలో సానుకూల వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. ఇటీవల చిరంజీవి సోషల్ మీడియాలో స్పందిస్తూ, "ప్రియమైన తమ్ముడు రవితేజ 'త్రినాథ్' పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయి సినిమాను తన భుజాలపై మోశాడు" అని కొనియాడారు. దర్శకుడు శివ నిర్వాణ కథను ఎంతో భావోద్వేగభరితంగా, లోతుగా తెరకెక్కించారని ప్రశంసించారు. చిత్రంలో ముఖ్య పాత్ర పోషించిన చిన్నారి నక్షత్రకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు.

# తెలుగువారిని కట్టిపడేసేలా 'పిఠాపురంలో.. అలా మొదలైంది'.. సెప్టెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!



కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే అనురాగం, నేటి తరానికి సరిపోయే సరికొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో... అలా మొదలైంది'. ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ అత్యంత వైభవంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ప్రముఖ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు.కొత్త సినిమాలు చూడండి ఈ వేడుకలో టాలీవుడ్ ప్రముఖులు మాట్లాడుతూ సినిమా విజయంపై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నటకిరీటి డా. రాజేంద్రప్రసాద్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఈ సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచంలోని తెలుగువారందరూ కనెక్ట్ అయ్యే అద్భుతమైన కంటెంట్ ఈ చిత్రంలో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో జరిగే కథే ఇదని, క్లైమాక్స్ సన్నివేశాలు చూసి ఆర్టిస్టులు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారంటే ఇందులో ఎంతటి బలమైన ఎమోషన్ ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లి ఈ చిత్రాన్ని ఆదరించాలని ఆయన ప్రేక్షకులను కోరారు. దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ, తాను ఈ సినిమాకు మనసుతో పాటు ప్రాణం పెట్టి పని చేశానని, ఇప్పటివరకు తాను చేసిన చిత్రాలన్నింటికంటే ఇది ఒక భిన్నమైన స్థాయిలో ఉంటుందని చెప్పారు. నిర్మాతలలో ఒకరైన ఆకుల సురేష్ మాట్లాడుతూ, తన ఊరిలో చూసిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నానని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం కచ్చితంగా అలరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, బివిఎస్ రవి, వీర శంకర్, సముద్ర, రాం ప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన తదితరులు పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ద్వారా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుండగా, చిన్న సినిమాలను ఆదరించే ప్రేక్షకులకు ఇది చక్కటి అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## అసెంబ్లీ గంట మోగితే.. రూ. కోట్లలోనే ఖర్చు!

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లో స్పీకర్ గంట మోగించగానే చర్చ మొదలవుతోంది. కానీ ఆ గంట మోగడం వెనుక ప్రతి గంటకు రూ. 15 నుంచి 20 లక్షల వరకు ఖర్చవుతుందని ఢిల్లీకి చెందిన స్వతంత్ర ఎన్జీవో సంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సేకరించిన గణాంకాలు చెబుతున్నాయి. ఎందుకంటే శాసనసభ నడవాలంటే తెరవెనుక పెద్ద సైన్యమే పనిచేస్తుంది. 250 మంది అసెంబ్లీ సచివాలయ సిబ్బంది, మార్షల్స్, 300 మంది పోలీసులు, శాసనసభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయడానికి వివిధ శాఖలకు చెందిన సుమారు 400 మంది సెక్షన్ ఆఫీసర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అసెంబ్లీకి వస్తారు.




# ఆ యాప్‌రం ఎక్కువే!

**వివాహేతర సంబంధాల యాప్ వినియోగంలో టాప్--5లో హైదరాబాద్**

**డేటా దుర్వినియోగం, సైబర్ నేరగాళ్ల ముప్పు పొంచి ఉందంటున్న పోలీసులు**

**సమస్యలకు ఇలాంటి యాప్‌లు పరిష్కారం కాదంటున్న మానసిక వైద్య నిపుణులు**



**హైదరాబాద్:** వివాహేతర సంబంధాల యాప్‌ల వినియోగంలో దేశంలోని టాప్--5 నగరాల్లో హైదరాబుద్ ఉన్నట్లు తేలింది. డిస్క్రీషన్ డేటింగ్(రహస్య డేటింగ్) పేరిట వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకోవడానికి కెనడాకు చెందిన ఓ యాప్ అడ్డాగా మారింది. తాజాగా ఆ విదేశీ యాప్ సంస్థ ప్రకటించిన తాజా గణాంకాల ప్రకారం దేశంలో 5 లక్షల మందికిపైగా యాక్టివ్ యూజుర్లు ఉండగా.. ఇందులో హైదరాబాద్‌కు చెందిన 1.10 లక్షల మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. యూజర్ల సంఖ్య ఆధారంగా దేశంలోనే టాప్--5 నగరాల్లో భాగ్యనగరం ఉందని కంపెనీ పేర్కొంది. ఐటీ కారిడార్లు గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల నుంచే 60 శాతం ట్రాఫిక్ తమ యాప్‌నకు వస్తోందని వెల్లడించింది. మొత్తం యూజర్లలో 68 శాతం మంది 25 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వారు ఉంటున్నారట. కొన్ని నివేదికల ప్రకారం..ఈ యాప్ కొత్త సబ్‌స్క్రైబర్లలో భారత్ ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉంది.

### యాప్ ఫీచర్లలో గోప్యత

ఇండియా యూజర్ ట్రెండ్స్ అండ్ డేటా ప్రైవసీ నివేదిక ప్రకారం.. ఈ యాప్ అందించే రహస్య ఫీచర్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఫొటోలను బ్లర్ చేసుకొనే అవకాశం ఉండటం, క్రెడిట్ కార్డులతో చెల్లింపుల విధానం, బ్యాంక్ స్టేట్‌మెంట్లలో యాప్‌పేరు కనిపించకుండా బిల్లింగ్ చేయడం వంటి సెక్యూరిటీ ఫీచర్లు ఉండటం వల్ల ఇది ఇలాంటి కార్యకులాపాలకు పాల్పడేవారికి ఆకర్షణీయంగా మారుతోంది.

### పోలీసులు, సైబర్‌నిపుణుల హెచ్చరికలు

డేటింగ్ యాప్‌ల కోసం వెంపర్లాడే వారిని సైబుర్‌నేరగాళ్లు బెదిరించి దోచుకొనే ప్రమాదం ఉందని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. సైబర్ క్రై మ్ గణాంకాల ప్రకారం డేటింగ్ యాప్‌లుకు సంబంధించిన ఫిర్యాదులు మూడేళ్లలో 40% పెరిగాయి. మరోవైపు డిజిటల్ గోప్యతకు 100% గ్యారంటీ ఉండదని, బ్లాక్‌మొయిల్, ఆర్థిక మోసాల ప్రమాదం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరియిస్తున్నారు. వివాహేతర సంబంధాల వల్ల సామాజికంగా, మానసికంగా ఎదురుయ్యే పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వైవాహిక బంధాలు బలహీనుపడ్డాయని డేటింగ్‌యాప్‌లను ఆశ్రయించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని చెబుతున్నారు.

## టి.జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు



**జగిత్యాల :** బీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. మాజీ ఎన్ఎస్‌యూఐ లీడర్ జగిత్యాల పట్టణ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మహేష్ తన మిత్రులతో కలిసి జగిత్యాల పట్టణంలోని జీవన్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కుల వృత్తులను నీరుగార్చిందన్నారు. గతంలో కేసీఆర్ చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను ప్రజానీకానికి చేరవేయడం మన బాధ్యతగా ముందుకు పోవాలని సూచించారు. బీఆర్ఎస్‌లోనే కార్యకర్తలకు నిజమైన గుర్తింపు లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ గెలుపు కోసం కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అభివృద్ధి పేరుతో గోదావరిఖనిలో వివాదాస్పదంగా చెట్ల నరికివేత

**రామగుండం మున్సిపల్ అధికారులపై స్థానికుల నిలదీత**

**కోల్ :** 'వృక్షో రక్షతి రక్షితః చెట్లను మనం రక్షిస్తే.. అవి మనల్ని రక్షిస్తాయని' అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యావరణ సందర్భంలో ప్రజలకు హితబోధ చేస్తుంటారు.. ఇవన్నీ ఉచిత సలహాలేనా..? ఆ సూచనలు ప్రజలకు తప్ప తమకు కాదన్నట్టుంది రామగుండం నగర పాలక అధికారుల ధోరణి. పారిశ్రామిక ప్రాంతంలో దశాబ్దాలుగా ప్రజలకు నీడనిస్తూ, ప్రాణవాయువు అందించే వృక్షాల నరికివేత చర్యల పట్ల పర్యావరణ ప్రేమికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటికి మొన్న గోదావరిఖని ప్రధాన చౌరస్తా పోచమ్మ ఆలయం వద్ద 70 యేళ్ల నాటి భారీ వృక్షంను నేలమట్టం చేశారు. అలాగే బస్టాండ్ సమీపంలోని చెట్లను అభివృద్ధి పనుల పేరుతో నరికివేశారు. ఈ చర్యలపై స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఈ సంఘటన మరువకముందే తాజాగా రెండు రోజుల క్రితం గోదావరిఖని రాజేష్ థియేటర్ వద్ద గల యేళ్ల నాటి భారీ వృక్షాలను సరికివేయడం వివాదాస్పదంగా మారింది. అధికారుల తీరుపై సామాజిక మాధ్యమం వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాల్సిన అధికారులే ఇలా చెట్లను నరకడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . సామాన్యులు చెట్లను నరికితే కేసులు, జరిమానాలు విధించే నగర పాలక అధికారులకు ఇవి కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి హుంకరిస్తే అధికారులు కళ్లకు గంతలు కట్టుకోవాల్సిందేనా అని విమర్శిస్తున్నారు. ఇప్పటికే చుట్టూ పరిశ్రమల ప్రభావంతో కాలుష్యపు







Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,